

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 04-02-2025 | సంపుటి - 21 | సంచిక -287 | రూ : 4 | పేజీలు: 8




# బడ్జెట్‌లో ఏపీ రైల్వే ప్రాజెక్టులకు..
# రూ.9,417 కోట్లు

- విశాఖ, తిరుపతి, నెల్లూరు, రాజమహేంద్రవరం స్టేషన్ల అభివృద్ధి
- మౌలిక వసతులపై ప్రధాన దృష్టి
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

దిల్లీ: బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టులకు రూ.9,417 కోట్లు కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 200914 మధ్యకాలంలో నాటి యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సగటు వార్షిక కేటాయింపు రూ.886 కోట్లతో పోలిస్తే, ఇది 11 రెట్లు అధికమని తెలిపారు. ఆయన సోమవారం దిల్లీలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని ప్రాజెక్టులకు పూర్తి సహకారం అందిస్తున్నారని, కేంద్రం, రాష్ట్రాల మధ్య మంచి సమన్వయం నెలకొన్నందున ప్రాజెక్టులన్నీ వేగంగా ముందుకు కదులుతున్నట్లు చెప్పారు. 'ప్రస్తుతం ఏపీలో రూ.80,097 కోట్ల నిధులతో 43 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. మొత్తం 5,560 కిలోమీటర్ల పొడవున పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే మంజూరైన ప్రాజెక్టులకు రూ.84,559 కోట్లు వెచ్చించబోతున్నాం. 73 రైల్వే స్టేషన్లను పూర్తిస్థాయిలో నవీకరించడానికి రూ.2,051 కోట్లు ఖర్చు చేస్తున్నాం' అని వివరించారు. కొత్త రైళ్లు, రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, ప్రతిపాదనలపై మంత్రి వైష్ణవ్ వివరించిన కీలకాంశాలివీ..

2014 నుంచి ఏపీలో 1,949 కి.మీ. మేర లైన్లను విద్యుదీకరణ చేసి, 100 శాతం పూర్తిచేశాం. పదేళ్లలో రాష్ట్రంలో 1,560 కి.మీ.

తరువాయి 2లో

# అర కోటి ఇళ్లలో 'గృహజ్యోతి'

- జనవరిలో 50.16 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్
- ఒక్కో ఇంటికి సగటున 67 యూనిట్ల వినియోగం

హైదరాబాద్: గృహజ్యోతి కింద లబ్ధి పొందుతున్న ఇళ్ల సంఖ్య తొలిసారి జనవరిలో అర కోటి దాటింది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వాడుతున్న పేదలకు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. గత నెలలో రాష్ట్రంలోని 50.16 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేశారు. పథకం ప్రారంభించిన 2024 మే నెలలో 42.51 లక్షల ఇళ్లలో 227.40 మిలియన్ యూనిట్ల (మి.యూ.) కరెంటు వినియోగమైంది. ఈ పది నెలల వ్యవధిలో లబ్ధి పొందుతున్న ఇళ్లు గరిష్ఠ స్థాయిలో పెరిగాయి. నెలల వారీగా చూస్తే అత్యధికంగా 2024 నవంబరులో 49.61 లక్షల ఇళ్లలో 413.87 మి.యూ.ల విద్యుత్ వినియోగమైంది. ఈ ఏడాది జనవరికి గృహజ్యోతి అర్హుల జాబితాలో చేరిన పేదల సంఖ్య 50.16 లక్షలు దాటగా వినియోగం 339 మి.యూ.గా నమోదైంది. సంబంధిత బిల్లు మొత్తాన్ని రాయితీ పద్దు కింద రాష్ట్ర ప్రభుత్వమే డిస్కంలకు చెల్లిస్తోంది. పథకం ప్రారంభమైన మొదటి నెల రూ.98 కోట్లను చెల్లించగా అత్యధికంగా గత నవంబరులో రూ.180 కోట్లు విడుదల చేసింది. ఇక జనవరికి రూ.143.14 కోట్లు ఇవ్వాల్సి ఉంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా నిజామాబాద్‌లో జనవరిలో 2.76 లక్షల ఇళ్లలో 19.17 మి.యూ. ఉచిత కరెంటు వినియోగమవగా ప్రభుత్వం రూ.7.99 కోట్లను భరించింది. ఈ పథకం రాయితీ సొమ్మును ప్రతినెల ప్రారంభంలోనే డిస్కంలకు ప్రభుత్వం విడుదల చేస్తోంది. పథకం ప్రారంభమైన నెలకు ముందు... 50 నుంచి 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే ఇళ్లలో ఇప్పుడు దాదాపు 10 శాతానికిపైగా వినియోగం




తరువాయి 2లో



# వలసదారులతో భారత్‌కు
# బయలుదేరిన అమెరికా విమానం!

అమెరికా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అక్రమ వలసదారుల ను లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ సాగుతోంది. అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించి అధికారులు ఆయా దేశాలకు ప్రత్యేక విమానాల్లో తరలిస్తున్నారు. తాజాగా భారత్‌కు చెందిన అక్రమ వలసదారులతో కూడిన విమానం ఇండియాకు బయలుదేరింది. ఈ విషయాన్ని అక్కడి అధికారులు వెల్లడించినట్లు వార్త ఏజెన్సీ రాయిటర్స్ పేర్కొంది. సీ17 ఎయిర్‌క్రాఫ్ట్‌లో వీరిని తరలిస్తున్నట్లు సమాచారం. భారత్‌కు చేరుకోవడానికి 24 గంటలు పడుతుందని అంచనా. అయితే ఎంత మంది వలసదారులను తరలిస్తున్నారనే విషయంపై సమాచారం లేదు.

తరువాయి 2లో

## బాసర క్షేత్రంలో వసంత పంచమి శోభ

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్

2లో



## : 25 నుంచి తెలంగాణ
# ఎప్‌సెట్ దరఖాస్తులు

- మార్చి 10 నుంచి ఐసెట్.. 17 నుంచి పీజీఈసెట్‌లకు..
- ప్రాథమిక కీపై అభ్యంతరాలకు ఫీజు

2లో





# కుంభమేళాపై 100
# అరుదైన తపాలా బిళ్లలు

ఇండోర్: ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళా, ఉజ్జయినిలోని సింహస్థమేళ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన 100 అరుదైన తపాలా బిళ్లలు, ప్రత్యేక తపాలా కవర్లను ఇండోర్‌లోని ఇద్దరు పౌరులు సేకరించి భద్రపరిచారు. వాటిలో 1977లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాకు సంబంధించిన ప్రత్యేక కవర్, స్వాతంత్ర్యానికి పూర్వం 1906 నాటి కుంభమేళాను ప్రతిఫలించే 'బజార్ పోస్ట్‌కార్డు' ఉన్నాయి. "ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే కుంభమేళాకు నా చిన్నతనం నుంచి హాజరవుతున్నాను. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంపై నాకు అమితాసక్తి ఉంది. ఈ నేపథ్యంలో కుంభమేళాకు సంబంధించిన తపాలా స్టాంపులు, ప్రత్యేక కవర్లు సేకరించడం ప్రారంభించాను" అని సేకరణకర్త ఓంప్రకాశ్ కెడియా (73) తెలిపారు. మరో సేకరణకర్త అలోక్ ఖడివాలా (53) మాట్లాడుతూ..కుంభమేళా, సింహస్థమేళా కార్యక్రమాలకు సంబంధించి తాను కూడా తపాలా స్టాంపులు, ప్రత్యేక కవర్లను భద్రపరిచినట్లు తెలిపారు.

## 12న అమెరికాకు
# ప్రధాని మోదీ..

- 13న ట్రంప్‌తో భేటీ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 12వ తేదీన రెండు రోజుల పర్యటన కోసం అమెరికా వెళ్లనున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. రెండు రోజుల పారిస్ పర్యటనను ముగించుకుని అటు నుంచి అటే మోదీ అమెరికాకు వెళ్తారని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. 12వ తేదీ సాయంత్రానికి వాషింగ్టన్ డీసీకి చేరుకోనున్న మోదీ.. 13వ తేదీన ట్రంప్‌తో భేటీ అవుతారని సమాచారం. అయితే మోదీ పర్యటనపై అధికారికంగా సమాచారం లేదు. పారిస్‌లో జరిగే కృత్రిమ మేధ సదస్సులో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీన మోదీ వెళ్లనున్నారు. 11వ తేదీ వరకూ ఆయన అక్కడ ఉంటారు. పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్న నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ అధ్యక్షుడయ్యాక అమెరికాను సందర్శిస్తున్న అతి కొద్ది మంది ముఖ్య నేతల్లో మోదీ ఒకరు.



# నిధులు ఆపేస్తాం..
# దక్షిణాఫ్రికాకు ట్రంప్ హెచ్చరిక

- 11 ఏళ్ల దిల్లీ సమయాన్ని 'ఆప్'దా వృథా చేసింది
- ఈసారి గెలుపు భాజపాదే
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



కేప్‌టౌన్: డొనాల్డ్ ట్రంప్ దూకుడు మీద ఉన్నారు. కెనడా, మెక్సికో, చైనాలపై సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడి చూపు ఇప్పుడు దక్షిణాఫ్రికాపై పడింది. ఆ దేశానికి అమెరికా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తామని ఆదివారం హెచ్చరించారు. దక్షిణాఫ్రికా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని.. కొన్ని వర్గాల ప్రజల భూములను జప్తు చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. దీనిపై తాము పూర్తిస్థాయి విచారణ నిర్వహిస్తామని, అప్పటివరకు ఆ దేశానికి నిధులు ఆపేస్తామని తెలిపారు. ట్రంప్ వ్యాఖ్యలపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం స్పందించింది. తాము తెచ్చిన కొత్త చట్టాన్ని ట్రంప్ యంత్రాంగం సరిగా అర్థం చేసుకోలేదని పేర్కొంది. దశాబ్దాలుగా సాగిన మైనారిటీ తెల్లజాతీయుల వివక్ష పాలన కారణంగా పడిన ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ చట్టాన్ని తెచ్చామని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమాఫోసా వివరణ ఇచ్చారు. ఎవరి భూములనూ జప్తు చేయడం లేదని తెలిపారు. దక్షిణాఫ్రికాలో పుట్టిన బిలియనీర్ ఎలాన్ మస్క్ కూడా దక్షిణాఫ్రికాలోని రమాఫోసా ప్రభుత్వం తెల్లజాతీయులను వేధింపులకు గురిచేస్తోందని గతంలో పేర్కొన్నారు.

# 25 నుంచి తెలంగాణ ఎప్‌సెట్ దరఖాస్తులు

హైదరాబాద్: రాష్ట్రంలో బీటెక్, బీఫార్మసీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈఏపీసెట్ (ఎప్‌సెట్)కు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 25 నుంచి ప్రారంభంకానుంది. సోమవారం జేఎన్‌టీయూహెచ్‌లో ఎప్‌సెట్‌తోపాటు పీజీఈసెట్, ఐసెట్ కమిటీల సమావేశాలు నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ ఇన్‌ఛార్జ్ వీసీ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, విద్యామండలి ఉపాధ్యక్షులు పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేశ్, కన్వీనర్ ఆచార్య బి.డీన్‌కుమార్, కోకన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి పాల్గొని దరఖాస్తుల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈసారి ఎప్‌సెట్ సహా అన్ని ప్రవేశ పరీక్షలు ముగిసిన తర్వాత అధికారులు విడుదల చేసే ప్రాథమిక కీపై అభ్యంతరాలు తెలపాలంటే ఒక్కో ప్రశ్నకు రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని నిర్ణయించారు. సదరు అభ్యంతరం సరైందని నిపుణుల కమిటీ భావిస్తే ఫలితాలు విడుదల చేసిన వారంలో డబ్బులు తిరిగిచ్చేస్తారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ తదితర పరీక్షల్లో ఈ విధానం కొనసాగుతోంది. ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన పీజీఈసెట్ కమిటీ సమావేశంలో సెట్ కన్వీనర్ ఏ.అరుణకుమారి, కోకన్వీనర్ బి.రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఐసెట్ కమిటీ సమావేశంలో మహాత్మాగాంధీ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్ ఆచార్య అలువాల రవి తదితరులు పాల్గొని దరఖాస్తుల షెడ్యూల్‌ను నిర్ణయించారు.

**ముఖ్యాంశాలివీ..**

ఇప్పటివరకు అన్‌రిజర్వ్‌డ్ కోటా 15% సీట్లకు తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీపడుతున్నారు. రాష్ట్ర విభజన పూర్తయి పదేళ్లు దాటినందున ఆ కోటా విషయమై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నోటిఫికేషన్ విడుదల చేసే నాటికి ప్రభుత్వం నుంచి స్పష్టత రాకుంటే.. ప్రవేశాల నాటికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తుది నిర్ణయం ఉంటుందని నోటిఫికేషన్‌లో పొందుపరచాలని కమిటీ నిర్ణయించింది. దివ్యాంగులకు ఉన్నత విద్యా కోర్సుల్లో 5% రిజర్వేషన్ కేటాయించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇప్పటివరకు దృష్టి లోపం, వినికిడి మూగ, అంగ వైకల్యం అనే మూడు కేటగిరీలు (ఏ, బీ, సీ) ఉండగా.. 3% రిజర్వేషన్ ఉంది. కొత్తగా నాలుగో కేటగిరీ (డి)గా ఆటిజం లాంటి మానసిక వైకల్యం, అయిదో కేటగిరీ (ఇ)గా ఒకటికి మించి వైకల్యాలను చేర్చారు. ఒక్కో కేటగిరీకి ఒక శాతం చొప్పున రిజర్వేషన్ ఉంటుంది. వారి సామాజికవర్గాల మొత్తం రిజర్వేషన్‌లోనే వారికి సీట్లు కేటాయిస్తారు. ఉదాహరణకు ఆటిజం విద్యార్థి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారైతే వారికి కేటాయించిన 15% రిజర్వేషన్‌లో సీటు కేటాయిస్తారు.



# పారిశ్రామికవేత్తలకు సహకారం అందిస్తాం

**ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి**

రాయదుర్గం : అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం అన్నిరకాలుగా సహకారం అందిస్తుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్ (డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం, ఆధునిక మౌలిక వసతులు హైదరాబాద్ నగరంలో మెండుగా ఉన్నాయి. ఐటీతోపాటు అన్ని రంగాల పరిశ్రమలు నగరంలో ఉన్నాయి. 120 కంపెనీలు ఇక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి. నగరంలో 200 ఎకరాల్లో కొత్త సిటీని నిర్మించనున్నాం. అక్కడే యువతకు ఏఐ వర్సిటీని ఏర్పాటు చేస్తాం. రాబోయే రోజుల్లో ఏఐ అంటే హైదరాబాద్‌ను తలచుకునేలా రూపొందిస్తాం. డీటీసీసీలో ప్రస్తుతం 500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి" అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీసీసీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరిస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లిన్ బిషప్, ఎండీ రీవ్స్ అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక విధ్వంసానికి గురైన ఏపీని ఆదుకోండి

* **16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాతో సీఎం చంద్రబాబు భేటీ**
* **రాష్ట్ర పరిస్థితులపై రెండు గంటలపాటు సుదీర్ఘ చర్చ**




దిల్లీ: ఒకవైపు విభజన కారణంగా నష్టపోయి, మరోవైపు గత ఐదేళ్ల పరిపాలన వల్ల ఆర్థిక విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాకు విజ్ఞప్తిచేశారు. జాతి నిర్మాణానికి చేయూతనివ్వాల్సి ఉన్నందున, రాష్ట్రాన్ని పునర్నిర్మించాల్సిన బాధ్యత తమపై పడిందని, ఇందుకోసం ఆర్థిక సంఘం 'అవుట్ ఆఫ్ ది బాక్స్' ఆలోచించి సాయం చేయాలని కోరారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం ఇక్కడికి వచ్చిన చంద్రబాబు.. సోమవారం ఆర్థిక సంఘం ఛైర్మన్ పనగడియాను కలిశారు. తొలుత 45 నిమిషాల పాటు అనుకున్న సమావేశం.. వివిధ అంశాలు ప్రస్తావనకు రావడంతో సుదీర్ఘంగా 2 గంటల పాటు సాగింది. ఈనెల 16న ఆర్థిక సంఘం ఏపీకి వస్తున్నందున రాష్ట్ర పరిస్థితులపై ప్రాథమిక అవగాహన కల్పిస్తూ చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విభజన కారణంగా ఏపీకి వారసత్వంగా వచ్చిన లోపాలకు గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం సాగించిన విధ్వంసం తోడై రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్న తీరును వివరించారు. ఆర్థిక సంఘం విశాల దృక్పథంతో ఆలోచించాలని కోరారు.

* **మీ సహకారంతో అధిగమిస్తాం**

ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ముఖ్యమంత్రి వివరించారు. 'పోర్టులు, లాజిస్టిక్ హబ్స్, పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటుచేసి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని భావిస్తున్నాం. ఏఐ, డీప్‌టెక్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని తదనుగుణంగా మానవ వనరులను తయారు చేయాలనుకుంటున్నామ'ని తెలిపారు. చారిత్రకంగా వచ్చిన పరిణామాలు ఈ భేటీలో చర్చకు వచ్చాయి. గుజరాత్, మహారాష్ట్ర ఆర్థిక నమూనాలు ప్రభావవంతంగా ఉన్న రోజుల్లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాడు చంద్రబాబు అమలు చేసిన హైదరాబాద్ మోడల్‌ను పనగడియా ప్రస్తావించారు. బిల్ గేట్స్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాక, ఆ నగరానికి ప్రపంచంతో ఎలా అనుసంధానం ఏర్పడిందో గుర్తుచేశారు. దేశంలో అభివృద్ధి పరంగా ముందున్న ఏడు రాష్ట్రాలు తీర ప్రాంతం, నౌకాశ్రయాల ఆధారిత ఆర్థిక వ్యవస్థల ద్వారా ముందుకెళ్తుండగా, తెలంగాణ మాత్రం 'గ్లోబల్ కనెక్ట్' వల్ల పోర్టులు లేకుండానే పురోగతి సాధించిందని విశ్లేషించారు. తాను నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు డిజిటల్ కరెన్సీపై చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తీసుకొచ్చిన మార్పులను పనగడియా గుర్తుచేశారు. నేడు భారత డిజిటల్ కరెన్సీ విధానం ప్రపంచానికే ఓ నమూనాగా మారిందని, ఇలాంటివి దేశానికి మరిన్ని అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

* **..ఇలా నష్టపోయాం**

కీలక రంగాల్లో ఏపీ ఎలా దెబ్బతిన్నదో గణాంకాలతో సహా ఆర్థిక సంఘానికి సీఎం వివరించారు. 'తలసరి ఆదాయం, మౌలిక వసతులు, కొనుగోలు శక్తి పరంగా ఏపీ వెనుకబడింది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణను పక్కాగా అమలు చేయడం వల్ల నష్టపోయాం. నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య సూచీలో ఏపీ దేశంలోని 18 పెద్ద రాష్ట్రాల్లో 17వ స్థానంలో ఉంది. ఆ నివేదిక ప్రకారం రుణ చెల్లింపు సామర్థ్యం సున్నాకు చేరింది. 2014 19 మధ్యకాలంలో ఏటా రెండంకెల వృద్ధి రేటు సాధించిన ఏపీ.. గత ఐదేళ్లలో మైనస్‌లోకి పడిపోయింది. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేయడంతో పాటు రూ.1.50 లక్షల కోట్ల బిల్లులు బకాయి పెట్టింది' అని పనగడియాకు వివరించారు.

# ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

* **మొదటి రోజు 10 నామపత్రాల దాఖలు**




కరీంనగర్, హైదరాబాద్: రాష్ట్రంలో మూడు శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ సోమవారం మొదలైంది. మొదటి రోజు మొత్తం 10 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. మెదక్‌నిజామాబాద్‌ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎస్.శ్రీకాంత్, కె.రఘోత్తంరెడ్డి, సీహెచ్.చంద్రశేఖర్‌లు నామినేషన్లు వేశారు. వరంగల్‌ఖమ్మంనల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎల్.వెంకటేశ్వర్లు నామపత్రాలను అందించారు. మెదక్‌నిజామాబాద్ ఆదిలాబాద్‌కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎస్.శ్రీకాంత్, డి.మహిపాల్, జి.లక్ష్మి, సీహెచ్. చంద్రశేఖర్, కె.సాయన్న, ఎం.ఆశమ్మలు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ గత నెల 29న ఖరారవగా..సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది.

## అర కోటి ఇళ్లలో 'గృహజ్యోతి'

(మొదటి పేజీ తరువాయి)

పెరిగినట్లు సిబ్బంది చెపుతున్నారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తున్నందున అంతకుముందు 50, 100, 150 యూనిట్ల మీటర్ రీడింగ్ వచ్చిన ఇళ్లలో ఇప్పుడు అంతకన్నా ఎక్కువగా రీడింగ్ నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ఈ తీరును డిస్కంలు విశ్లేషిస్తున్నాయి. ఈ పథకంలో చేరడానికి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, కొత్త రేషన్‌కార్డుల జారీ తర్వాత అర్హత పొందే ఇళ్ల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

**14 యూనిట్ల పెరుగుదల**

రాష్ట్రంలో జనవరిలో 50.16 లక్షల ఇళ్లలో 339.52 మి.యూ.ల కరెంటు వినియోగమైంది. ఒక్కో ఇంటికి సగటున వాడింది 67 యూనిట్లు. పథకం ప్రారంభమైన 2024 మేలో ఉచిత పథకంలో ఉన్న 42.51 లక్షల ఇళ్లలో ఈ సగటు వినియోగం 53 యూనిట్లు. ప్రస్తుతం దానికి అదనంగా 14 యూనిట్లు పెరిగింది. గరిష్ఠంగా గత నవంబరులో ఒక్కో ఇంటి వినియోగం 83 యూనిట్లు నమోదైంది. ప్రస్తుతం ఉచిత సరఫరా పొందుతున్న 50.16 లక్షల ఇళ్లలో పూర్తిస్థాయిలో 200 యూనిట్లు వినియోగించుకుంటే 1,063 మి.యూ.లకు పైగా సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం లబ్ధిదారుల వినియోగం అందులో మూడోవంతు మాత్రమే ఉంటోంది.

## బాసర క్షేత్రంలో వసంత పంచమి శోభ

ముథోల్: వసంత పంచమి వేళ బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ పరిసరాలు సోమవారం భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడుల నుంచి తరలివచ్చిన భక్తులు అర్ధరాత్రి 12 గంటల నుంచే దర్శనం, అక్షరాభ్యాసాల కోసం బారులు తీరారు. వేకువజామున రెండు గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3 గంటల నుంచి అక్షరాభ్యాసాలు ప్రారంభించారు. అధికారిక ప్రొటోకాల్ ప్రకారం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం పట్టు వస్త్రాలు సమర్పించేందుకు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఈసీ అనుమతి ఇచ్చినప్పటికీ.. ఉత్తర్వులు సకాలంలో అందకపోవటంతో ముహూర్త సమయం దాటిపోకుండా శాఖ నిర్ణయం మేరకు కలెక్టర్ ఆ బాధ్యతలు నిర్వహించారు.

## బడ్జెట్‌లో ఏపీ రైల్వే ప్రాజెక్టులకు.. రూ.9,417 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

మేర కొత్త రైల్వే ట్రాక్ నిర్మించాం. ఇది శ్రీలంకలో ఉన్న మొత్తం రైల్వే నెట్‌వర్క్ కంటే ఎక్కువ. 200914 మధ్యకాలంలో ఏటా సగటున 73 కి.మీ. మేర కొత్త ట్రాక్‌లు నిర్మించగా, 201425 మధ్య అది 142 కి.మీ.కు పెరిగింది. ఇదే సమయంలో విద్యుదీకరణ పనులు సగటున 37 కి.మీ. నుంచి 177 కి.మీ.కు పెరిగాయి. 2014 తర్వాత ఏపీలో 770 ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించాం. 65 లిఫ్టులు, 34 ఎస్కలేటర్లు, 509 స్టేషన్లలో వైఫై సౌకర్యం అందుబాటులోకి తెచ్చాం. ప్రస్తుతం 15 జిల్లాల గుండా 8 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. మాల్డా బెంగుళూరు మధ్య నడుస్తున్న ఒక అమృత్ భారత్ ఏపీలోని 9 జిల్లాల గుండా సాగుతూ, 14 చోట్ల ఆగుతోంది.

**శాస్త్రీయంగా అనుమతులు**

కొన్నాళ్లుగా రైల్వే శాఖలో కొత్త ప్రాజెక్టులను శాస్త్రీయంగా పరిశీలించాకే ఆమోదిస్తున్నాం. యూపీఏ ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రాజెక్టులను బడ్జెట్‌లో చేర్చి, నామమాత్రంగా నిధులు కేటాయించేవారు. తద్వారా ఎలాంటి ప్రయోజనమూ ఉండేది కాదు. ప్రస్తుతం తొలుత సర్వే చేసి, అందులో ఫీజిబిలిటీ ఉందని తేలితేనే డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. అందులో ట్రాఫిక్ ఉంటుందని తేలితే అప్పుడు ఆర్థిక శాఖ, నీతి ఆయోగ్, వాణిజ్య శాఖల దృష్టికి తీసుకెళ్లి క్యాబినెట్ ముందు పెడుతున్నాం. గతేడాది జులై నుంచి రూ.40 వేల కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. ఇందులో ఏపీ రాజధాని అమరావతి లైన్ కూడా ఉంది. మేం ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులను బడ్జెట్ ప్రసంగంలో మాత్రమే ప్రకటించడం లేదు. ఈ ప్రక్రియ ఏడాది పొడవునా సాగుతోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 7వేల కి.మీ. మేర పాత ట్రాక్‌ను మార్చి, కొత్తది వేయబోతున్నాం. మన రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా గంటకు 110 కి.మీ. వేగంతో రైళ్లను పరుగులు పెట్టించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.

**ప్రధాన స్టేషన్లకు కొత్త కళ**

* విశాఖపట్నం స్టేషన్ అభివృద్ధి పనులు రూ.446 కోట్ల అంచనాలతో చేపట్టగా, పాత గుత్తేదారు పనులు సరిగ్గా చేయనందున టెండర్ రద్దుచేశాం. ఆ కాంట్రాక్టర్ హైకోర్టుకు వెళ్లగా, రైల్వేకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ తీర్పు కాపీ ఇంకా విడుదల కాలేదు. న్యాయప్రక్రియ పూర్తయ్యాక రీటెండర్లు పిలిచి, పనులు అప్పగిస్తాం.
* రూ.103 కోట్లతో తలపెట్టిన నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి.
* రూ.312 కోట్లతో చేపట్టిన తిరుపతి స్టేషన్ పనులూ వేగంగా జరుగుతున్నాయి.
* రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.271.43 కోట్ల వ్యయ అంచనాలతో టెండర్లు సిద్ధం చేస్తున్నాం. ఈ 4 స్టేషన్ల అభివృద్ధికి రూ.1,132.43 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

## వలసదారులతో భారత్‌కు బయలుదేరిన అమెరికా విమానం!

(మొదటి పేజీ తరువాయి)

అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. తొలుత 538 మందిని అరెస్టు చేసి ఆయా దేశాలకు తరలించారు. ఇక ఎల్ పాసో, టెక్సాక్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు యూఎస్ విమానాల్లో పలువురిని తరలించింది. ఇక ఒక్కొక్క వలసదారుడిని తరలించేందుకు అమెరికాకు భారీ ఖర్చు అవుతోంది. గతవారం గటెమాలాకు తరలించిన ఒక్కో వ్యక్తిపై అమెరికా సుమారు 4,675 డాలర్లను ఖర్చు పెట్టింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. యూఎస్‌లో సరైన ధ్రువపత్రాలు లేకుండా భారత్‌కు చెందిన వలసదారులు 7,25,000 మంది ఉన్నట్లు సమాచారం. వీరిలో 18,000 మందిని భారత్‌కు తరలించేందుకు అమెరికా ప్రభుత్వం జాబితాను రూపొందించింది. మెక్సికో, సాల్వెడార్ ప్రజల తర్వాత ఎక్కువగా ఉన్నది భారతీయులే.

**కెనడా, మెక్సికోలపై టారిఫ్ నెలరోజు పాటు నిలుపుదల**

మెక్సికో, కెనడాలపై విధించదలుకున్న 25 శాతం సుంకాలను అమెరికా నెలరోజుల పాటు నిలిపివేయడానికి నిర్ణయించింది. ఇరు దేశాల అధినేతలు అమెరికా సరిహద్దుల వెంట భద్రతను కట్టుదిట్టం చేస్తాయని హామీ ఇచ్చిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు మరొక్కసారి అన్యాయం

- **జాతీయ బిసి సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పేదలను అణగదొక్కుతూ... ధనికులను మరింత ధనికులుగా చేసేలా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని జాతీయ బిసి సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పేదలు, మధ్య తరగతి ప్రజల నుంచి పన్నుల రూపేనా 52 లక్షల 65 వేల 300 వందల కోట్ల రూపాయలు వసూలు చేసి అందులో 12 లక్షల కోట్లు పేదలకు బడ్జెట్‌లో పెట్టి మిగతా లక్షల కోట్లను దేశంలో ఉన్నటువంటి కార్పొరేట్ శక్తులకు, ధనవంతులకు, పారిశ్రామిక వేత్తలకు అనేక విధాలుగా అండగా నిలుస్తూ ధనవంతులను ఇంకా ధనవంతులుగా చేసే విధంగా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వలేదని, దేశంలో విద్యా, ఉపాధి అవకాశాలతోనే పేదరికాన్ని రూపు మాపవచ్చు కానీ వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదని పేర్కొన్నారు. దేశంలో ఉన్న బిసిలకు 2800 కోట్లు కేటాయించి, దేశంలో 66శాతం ఉన్న బిసిలను మరొక్కసారి మోసం జేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని విమర్శించారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పరోక్షంగా అణగదొక్కే విధంగా బడ్జెట్ ఉందని, కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల దృష్టిలో పెట్టుకొని, త్వరలో ఎన్నికలు జరగబోయే డిల్లీ, బీహార్ రాష్ట్రలకు ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందని ఆరోపించారు. అలానే బిజెపి ప్రభుత్వం ఏ రాష్ట్రాలలో ఉందో అక్కడ పెద్ద మొత్తంలో డబ్బులు కేటాయించడం జరిగిందని, మన తెలంగాణ విషయానికొస్తే తెలంగాణ ద్వారా జిఎస్‌టి, ట్యాక్స్‌ల రూపంలో వేల కోట్ల రూపాయలు కేంద్ర తీసుకుంటూ తెలంగాణకు అరకొర నిధులు కూడా ఇవ్వకుండా మొండి చేయి చూపించేటువంటి పరిస్థితి కనబడుతోందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గానీ, బయ్యారం ఉక్కు కర్మాగారం గానీ, గిరిజన యూనివర్సిటీ లాంటి సమస్యలు గానీ, ఐఐటీ గానీ, ఐఐఎం గానీ, రైల్వే ప్రాజెక్టులు గానీ, నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం గాని ఏది ఇవ్వకుండా తెలంగాణకు మరొక్కసారి అన్యాయం చేసిందని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు ఎప్పటి వరకు ఇస్తారు ఎక్కడ ఇస్తారు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

* **వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఇందిరమ్మ ఇండ్లు ఎప్పటి వరకు ఇస్తారు ఎక్కడ ఇస్తారు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం వివేకానంద డివిజన్లో ఇందిరమ్మ ఇండ్లు సర్వేలో భాగంగా వార్డ్ ఆఫీసులో ప్రజా పాలనలో అప్లై చేసుకున్న సర్వే లిస్టులో రానివారికి, కొత్త దరఖాస్తుల స్వీకరణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పి ప్రజలను వేధించే పాలన చేస్తుందన్నారు. గతంలో ప్రజాపాలన 6 గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించి అందులో 40% మాత్రమే ఎంట్రీలు చేశారని ఎంట్రీలు అయిన వాటిలో కూడా కేవలం ఒక్క పథకం మాత్రమే అందుకుంటున్న ప్రజలు ఎంతోమంది ఉన్నారన్నారు. కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ కేవలం ఇందిరమ్మ ఇండ్లకు మాత్రమే స్వీకరించడం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏవైతే ఆరు గ్యారంటీలు అని చెప్తున్నారు వాటికి కూడా స్వీకరించాలన్నారు. కొత్త రేషన్ కార్డుల నిరంతర ప్రక్రియని దరఖాస్తుల స్వీకరించట్లేదు ఎప్పుడు స్వీకరిస్తారన్నది స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి వారిని వార్డ్ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ ప్రజలను ఇబ్బంది పెడుతూ ఇంకా ఎన్ని రోజులు కాలం గడుపుతారు అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గారెంటీలు అమలు చేయకపోతే ప్రజల తరపున అమలు చేసే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

## నాగంకే మళ్ళీ పార్టీ పగ్గాలు.

**రెండవసారి బిజెపి జిల్లా అధ్యక్షులు గా నాగం వర్షిత్ రెడ్డి..**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడి ఎన్నిక గత కొన్ని రోజులుగా ఉత్కంఠ కొనసాగింది, ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి విడుదల చేసిన మొదటి 27 మంది బిజెపి జిల్లా అధ్యక్షులు జాబితాలో నల్గొండ జిల్లా నుండి అధ్యక్ష పీఠం కోసం సీనియర్ నాయకులు తీవ్రంగా పోటీ ఉన్నపటికీ మెజారిటీ సభ్యుల అభిప్రాయాల మేరకు నాగం వర్శిత్ రెడ్డినే రెండవసారి బీజేపి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తు ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి..యెండల లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణలో బిజెపి బలపడుతున్న నేపథ్యంలో రానున్న ఎన్నికలలో బీజేపి అధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్ళడానికి యువతకు ప్రాధాన్యత కల్పించాలనే భావనతో వర్షిత్ రెడ్డి కే పార్టీ పగ్గాలు ఇస్తే బాగుంటుంది అని పలువురి అభిప్రాయం వ్యక్తం కావడంతో మళ్ళీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు... చిన్న వయస్సులోనే పార్టీ జిల్లా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో పార్టీని ముందుకు తీసుకెత్తు ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడుగా నిలబడి అందరి చేత మన్ననలు పొందారు.ఈ క్రమంలో రెండో సారి అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వడంతో పార్టీ కార్యకర్తలు, నాయకుల నుండి నాగం వర్షిత్ రెడ్డికి అభినందనలు వెలువెత్తుతున్నాయి..

## ట్రినిటి విద్యాసంస్థలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు:

- **211మంది బాలబాలికలకు అక్షరాభ్యాసం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటి విద్యా సంస్థలలో వసంత పంచమి (సరస్వతి అమ్మవారి పుట్టినరోజు) వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి భక్తిశ్రద్ధలతో సరస్వతీ మాతను పూజించారు. విద్యార్థినీ, విద్యార్థుల అక్షరాభ్యాస కార్యక్రమంలో 211మంది బాలబాలికలు పాల్గొని అక్షరాభ్యాసం చేయించుకున్నారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో బాలబాలికలు, తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్యలు, నానమ్మ తాతయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెన్ రెడ్డిరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో చిన్నారులంతా అత్యున్నత స్థాయి అధికారులుగా ఉన్నత పదవులను అధిరోహించాలని మనస్ఫూర్తిగా దీవించారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల, విద్యా సంస్థల చైర్మన్ కేవీబి కృష్ణారావు, సమన్వయ కర్తలు శివరాణి, శ్రీదేవి, మంజుల, జ్యోతి, కొండమ్మ, లోవ కుమారి, సుమలత, స్వరూప, భార్గవి, శ్రీవాణి, నీరజ, స్వప్న, అంజలి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడ్జెట్ లో అన్ని వర్గాలకు సముచిత న్యాయం

- **మోదీ చిత్రపటానికి పాలాభిషేకం**
- **దూడల బిక్షం గౌడ్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 202526 ఆర్థిక బడ్జెట్ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సముచితమైన న్యాయం జరిగిందని బిజెపి మునుగోడు కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం జాతీయ రహదారిపై బిజెపి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి నాయకులతో కలిసి సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దూడల భిక్షం గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజల, కూలీల, రైతులను, విద్య, ఆరోగ్యం, ఉపాధి పైన ప్రత్యేక దృష్టి పెట్టిన విధానం ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారన్నారు. రూ.12లక్షల వార్షిక ఆదాయంతో పాటు ఉద్యోగులకు, నిరుద్యోగులకు మంచి బడ్జెట్ గా అభివర్ణించారు. గ్రామీణ ప్రాంతంలోని రోడ్లు, మంచినీరు, వ్యవసాయంపై పెట్టిన దృష్టి, స్వదేశీ వస్తువుల ఉత్పత్తి హర్షించేలా ఉందన్నారు. జాతీయ రహదారులు, వేగవంతమైన రైళ్లు, రైల్వే రోడ్లు రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, నూతన విమానాశ్రయాల నిర్మాణం వైద్య కళాశాలలో సీట్ల పెంపు అందరూ కొనియాడుతున్నారన్నారు. 2047నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా దారులు చూపే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. ఈ బడ్జెట్ జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వ్యతిరేకించి ధర్నాలు చేయటం సిగ్గుచేటని ఆరోపించారు. చక్కటి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన గారు, ఉపాధ్యక్షుడు రమణ గోని శంకర్, పోలోజు శ్రీధర్ బాబు, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, కాసుల వెంకటేశం, చినుకుని మల్లేశం, దిండు భాస్కర్, పబ్బు వంశీ, కడారి ఐలయ్య, ఊడుగు యాదయ్య, అల్మాస్ పేట గౌతమ్, మిర్యాల రవి, పెద్దగొని జంగయ్య, ఇస్తారి, వెంకటేశం, బడుగు ధనుంజయ, అమృత దశరథ, దామోదర్ రెడ్డి, గట్టు మొగులయ్య, బుడ్డ సురేష్, తోకల సాయికుమార్, మార్గం స్వామి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## లక్షడప్పులు వేల గొంతులును జయప్రదం చేయాలి

- **బోయ లింగస్వామి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి కోరారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షతన లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమం వాల్ పోస్టర్ లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోయ లింగస్వామి గారు మాట్లాడుతూ 30ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం సుప్రీంకోర్టు తీర్పుతో చివరి దశకు వచ్చిందన్నారు. ఈ తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను త్వరగా అమలుచేయాలని కోరుతూ మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మాదిగల గుండె చప్పుడును లక్ష డప్పుల ద్వారా ఈ ప్రపంచానికి చాటి చెప్పే మహత్తర కార్యక్రమాన్ని మండలంలో ఉన్న ప్రతి మాదిగ బిడ్డ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ బోయ రామచంద్రం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్, మాజీ సర్పంచులు ఊదరి నర్సింహ్మ, గుడ్డేటి యాదయ్య, బక్క శ్రీనాథ్, ఊదరి వెంకటేష్ మహజన్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాము, సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి, ఊదరి నరసింహ, దొనకొండ కృష్ణ, ఊదరి శ్యాంసుందర్, ఎర్ర శంకర్, బర్రె సుధాకర్, ఎర్ర గౌతం, బోదుల లింగస్వామి, బొడ్డు గణేష్, చీమకండ్ల శ్రీనివాస్, సుక్క కృష్ణ, గుడ్డేటి ప్రవీణ్, యాదగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబిటస్ లో వసంత పంచమి వేడుకలు

- **చిన్నారులకు అక్షరాభ్యాసం**
- **కుంచారం జైపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని అంబిటస్ ది స్కూల్ లో వసంత పంచమి వేడుకలను అంబిటస్ విద్య సంస్థల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహంచినారు. ఈ కార్యక్రమాన్ని అంబిటస్ విద్య సంస్థల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విగ్నేశ్వర, మహాసరస్వతి హోమ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు సామూహిక పూజ నిర్వహించి, నూతన ప్రవేశం పొందిన చిన్నారులకు అక్షరాభ్యాసం గావించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చైర్మన్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జ్ఞాన సరస్వతి దేవి ఆశీస్సులతో విద్యార్థులు సంస్కారవంతమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సైతం నిత్యం నూతన విషయాలను విద్యార్థులకు అందించాలని, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అంబిటస్ ది స్కూల్ లో చదువుతో పాటు, సంస్కారాన్ని అందిస్తూ, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఏనలేని కృషి చేస్తోందన్నారు. భారతీయ కళలకు నిలయమైన ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలను, తమ పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. నర్సరి చిన్నారుల సరస్వతి శ్లోక పఠనం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎం. ఈ.ఎఫ్ . జిల్లా అధ్యక్షులు గా ఇంజ మహేష్ మాదిగ



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇంజ మహేష్ మాదిగ తెలంగాణ రాష్ట్ర ఎం ఈ ఎఫ్ ( మాదిగ ఉద్యోగుల సమాఖ్య) రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్ మాదిగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న ఆధ్వర్యంలోఏకగ్రీవంగా యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా ఇంజ మహేష్ మాదిగ ని సోమవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి సురేష్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పత్రాన్ని సోమవారం హైదరాబాదులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులు ఇంజ మహేష్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఎం ఈ ఎఫ్ నాయకులకు, యాదాద్రి భువనగిరి జిల్లా, ఎం ఈ ఎఫ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు. ఎం ఎస్ పి నాయకులకు, ఎమ్మెస్ ఎఫ్ నాయకులకుప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కిరాణం అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- **అధ్యక్షునిగా వెంకటేష్, కార్యదర్శిగా లింగస్వామి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ కిరాణం అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కామిశెట్టి వెంకటేష్, కార్యదర్శిగా లింగస్వామి లనం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, లింగస్వామిలు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన గోశిక సత్యనారాయణ, వీసం చంద్రారెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్, ఢిల్లీ శంకర్ రెడ్డి కామిశెట్టి భాస్కర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తడకమళ్ళ శ్రీనివాస్, రమేష్, కృష్ణమూర్తి, వీరోజి ప్రభాకర్, ఉప్పల కృష్ణ, మహేందర్ రెడ్డి, వెంకట్ నర్సయ్య, శ్రీను, నర్సింహ్మ, రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచశీల స్కూల్ లో వసంత పంచమి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసాపేటలోని పంచశీల స్కూల్ లో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సుమారు 25 మంది చిన్నారులు అక్షరభ్యాసం చేయించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరు చెరువులో రాజపేట మండల రైతు జేఏసీ నిరసన



రాజపేట, ప్రజాస్ఫూర్తి : మండల రైతు జేఏసీ ఆధ్వర్యంలో రాజపేట మండలంలోని చల్లూరు గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చల్లూరు గ్రామ పరిధిలో ఉండే చెరువులు మల్లయ్య చెరువు, మల్పవాణి చెరువు, చెండాయ చెరువులను నీళ్లు నింపాలని రైతు జేసి ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మండల రైతు జేఏసీ కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, గౌరవ అధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి. ఎన్ . గోపాల్ రెడ్డి, బుడిగ జంగాల జిల్లా అధ్యక్షులు రాజు, భాస్కర్ కోపరేటివ్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, చింతల దాసు, బోగోని ఉప్పలయ్య, నర్సాపూర్, చలవలపల్లి లక్ష్మణ్, నాగపురి పుల్లయ్య, భగవాన్ రెడ్డి, చల్లూరు గ్రామ రైతులు, బి. ఆర్. ఎస్ పార్టీ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి సామల రమేష్ మండల కార్మిక శాఖ అధ్యక్షులు సట్టా విజయ్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుంటి కృష్ణ, బిజెపి బూతు అధ్యక్షులు గంగు జలంధర్ రెడ్డి, బి ఆర్ ఎస్ . యూత్ అధ్యక్షులు ఆముదాల అజయ్, బండపల్లి మధు, ఆర్ సాయి, కోట పవన్, బండపల్లి ప్రశాంత్, గుంటి నవీన్, రేణిగుంట ప్రశాంత, రైతులు అరకాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ గణపురం మార్కండేయ, అరుకాల తిరుపతిరెడ్డి, రేణిగుంట నరసయ్య, సార్ల రాములు,వై. మల్లేశం, బొంత నర్సింలు, రేణిగుంట తిరుపతి వర్కర్ నరసయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు తప్పక వినియోగించుకోవాలి

* **పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్ష అభ్యర్థి ఊట్ల చంద్రారెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఇంటి యజమానులు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్ష అభ్యర్థి ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. ఈనెల 7న రోడ్ నెంబర్ 9 లోనే శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో జరిగే బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో భాగంగా సోమవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన ఇంటి యజమానులందరినీ ప్రత్యక్షంగా కలుసుకొని ఆవు దూడ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఏవైనా ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరు తప్పక వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటి యజమానులందరికీ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎన్నికల కార్డు జారీ చేయడం జరిగిందన్నారు. కార్డు రాని యజమానులు స్టీరింగ్ కమిటీ సభ్యులను సంప్రదించి పొందాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే ఇంటి యజమాని ఆ కార్డుతో పాటుగా ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఏదైనా గుర్తింపు పొందిన కార్డును తీసుకొని పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. బస్తీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతూ, ప్రజల మధ్యనే ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తున్న తనను మరో మారు అధ్యక్షుడిగా పోటీలో ఉన్న తన గుర్తు ఆవు దూడ పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో మరోమారు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తి ఇంటి యజమానులు, వివిధ పార్టీలకు చెందిన నేతలు, బస్తి వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

* **సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కేంద్రంలో ఉన్న బిజెపి సంకీర్ణ ప్రభుత్వం బడ్జెట్ ని ప్రవేశపెట్టిందని, ఈ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ తో షాపూర్ నగర్ సిపిఎం కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రజలు బిజెపికి ఎనిమిది ఎంపీ సీట్లు కట్టబెడితే బడ్జెట్లో తెలంగాణను పూర్తిగా విస్మరించి బిజెపి దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఇప్పుడు ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించి మిగతా రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపించి తెలంగాణలో ఉపాధి హామీ పథకాన్ని నీరుగారిచే విధంగా తక్కువ బడ్జెట్ ని కేటాయించడం జరిగిందన్నారు. వ్యవసాయంగానికి కూడా సరైన బడ్జెట్ కేటాయించలేదు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేదలు కార్మికులు వ్యవసాయ కూలీలు అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని లేని పక్షంలో పేదలను కార్మికులను రైతులను సమీకరించి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య , ఈ దేవదానం, కే శీను, మల్లారెడ్డి, వీరేషు సాధులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు

# వసంత పంచమి వేడుకలు కాదు.. అడ్డగోలు వసూళ్లే ఎజెండా

- **అక్రమ అడ్మిషన్లను ప్రారంభించిన పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వినతి**
- **ఎస్ఎఫ్ఐ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వసంత పంచమి, సరస్వతి దేవి పూజలు అంటూ.. లక్ష్మి కటాక్షం కోసం అడ్డగోలు వసూళ్లే ధ్యేయంగా అక్రమంగా అడ్మిషన్లకు తెరలేపిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని అడ్మిషన్లు ప్రారంభించిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇన్చార్జ్ మండల విద్యాధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే వసంత పంచమి పేరుతో అక్రమంగా అడ్మిషన్లను ప్రారంభించి విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే చౌటుప్పల్ లోని పలు ప్రైవేటు పాఠశాలలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యార్థుల నుండి వేల రూపాయలను వసూలు చేస్తూ విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులే ప్రధాన ఎజెండాగా ప్రైవేట్ విద్యాసంస్థల యజమాన్యాలు శ్రీ చైతన్య, అంబిటస్, శ్రీ గాయత్రి సంస్థలు 2024 25విద్యా సంవత్సరం పూర్తి కాకముందుకే విద్యార్థుల నుంచి వసంత పంచమి పేరుతో అడ్మిషన్లు ప్రారంభించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా విద్యార్థుల నుంచి ముందే సంబంధిత పత్రాలను తీసుకుంటారని, తద్వారా సదరు విద్యా సంస్థ ప్రవర్తన నచ్చకపోతే, ఇతర విద్యాసంస్థలోకి వెళ్లడం కోసం ప్రయత్నిస్తే, వెళ్లనివ్వకుండా వివిధరకాలుగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉందన్నారు. కావున విద్యా సంవత్సరం పూర్తికాక ముందే విద్యార్థుల నుంచి అడ్మిషన్లను తీసుకుంటున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్, నాయకులు రాకేష్, శివ, నందు, అఖిల, శిరీష, ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్య సంస్కృతిలో కొత్త అధ్యాయం

- **టీకన్సల్ట్ ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ కొత్తదారి**
- **ప్రముఖ ఆసుపత్రులు, ఔషధ పరిశ్రమ నాయకులు సంఘీభావం**




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్‌లోని టీ హబ్ వేదికగా టీకన్సల్ట్ ఇంటిగ్రేటెడ్ హెల్త్ నెట్ వర్క్ సహకారంతో రెండు రోజుల పాటు జరిగిన సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో ప్రఖ్యాత వైద్య నిపుణులు, ఆరోగ్య పరిశ్రమకు చెందిన ప్రముఖులు పాల్గొని సమగ్ర వైద్య పరిష్కారాల భవిష్యత్తుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేచురోపతి నిపుణుడు మంతెన సత్యనారాయణ రాజుతో పాటు, డివిస్ లాబోరేటరీస్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ దివి మధుసూదన్ రావు, యశోధ ఆస్పత్రి నుండి డా. కీర్తి, కేర్ ఆస్పత్రి నుండి డా. నింద్రా అరుమగం, నిమ్స్ నుండి డా. రమేష్ మార్త, వెల్ నెస్ హాస్పిటల్స్ నుండి డా. జె.ఎన్ వెంకట్, కిమ్స్ ఆస్పత్రి నుండి డా. మేక ప్రత్యూష, గ్లోబల్ హాస్పిటల్ నుండి డా. నవీన్ రెడ్డి, రెయిన్ బో హాస్పిటల్ నుండి డా. పూజిత సూరపనేని, ఒమేగా నుండి డా. రితేష్ రంజన్ పాల్గొన్నారు.

**ఏఐ ఆధారిత ప్రత్యక్ష అనువాదంతో ఆరోగ్య విప్లవం**

ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా మంతెన సత్యనారాయణ రాజు ప్రసంగం నిలిచింది. ఆయన తెలుగులో మాట్లాడినా, టీకన్సల్ట్ ఏఐ సాంకేతికత ద్వారా 60 దేశాల్లోని ప్రజలకు 13 భాషల్లో ప్రత్యక్ష అనువాదంతో అందించబడింది. ఇది సాంప్రదాయ ఆరోగ్య పరిష్కారాలను ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప అవకాశంగా మారింది.సాంప్రదాయ ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు టీకన్సల్ట్ చేసే కృషిని అభినందించిన మంతెన, నిత్య జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ముఖ్యమైన సూచనలు చేశారు. ముఖ్యంగా టెక్నోక్రాట్లు, అస్థిర షిఫ్ట్‌లో పని చేసే వారికోసం ఆయన యోగా, మొలకలు, సమయానికి భోజనం వంటి ఆరోగ్య పద్ధతులను పాటించాలని సూచించారు.

**సమగ్ర ఆరోగ్య సంరక్షణకు ఏకీకృత దృక్పథం**

సదస్సులో టీ కన్సల్ట్ వ్యవస్థాపకుడు సందీప్ మక్తాలా మాట్లాడుతూ, సమగ్ర వైద్య విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర వహిస్తాయని తెలిపారు. భారతదేశపు సంప్రదాయ వైద్య పద్ధతులను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం ద్వారా మెడికల్ టూరిజం మరియు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడతాయని వివరించారు.సాంప్రదాయ వైద్య నిపుణులతో కలిసి పనిచేసేందుకు తాను దేశవ్యాప్తంగా పర్యటిస్తానని సందీప్ మక్తాలా తెలిపారు. వ్యక్తిగతంగా వైద్య సేవలు అందించే నిపుణులు సమగ్ర ఆరోగ్య సంరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్కృతిలో కొత్త అధ్యాయం63 దేశాల్లో తన ఆధిపత్యాన్ని విస్తరించుకున్న టీకన్సల్ట్ కొలబ్రెషన్ కాన్ క్లేవ్ 2025 ఆధునిక వైద్యం మరియు సాంప్రదాయ వైద్య విధానాలను కలిపే ఒక సమగ్ర ఆరోగ్య వ్యవస్థను సృష్టించడంలో కీలక మైలురాయిగా నిలిచింది.

**కార్యక్రమం ముఖ్యాంశాలు:**

ప్రపంచవ్యాప్త ఆవిష్కరణ మంతెన సత్యనారాయణ రాజు ప్రసంగం 60 దేశాలకు, 13 భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. వైద్య నిపుణుల మద్దతు ప్రముఖ ఆసుపత్రులు , ఔషధ పరిశ్రమ నాయకులు సమగ్ర ఆరోగ్య సంరక్షణ ఉద్యమానికి మద్దతు తెలిపారు.మెడికల్ టూరిజం & ఆర్థిక వృద్ధి భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం ద్వారా మెడికల్ టూరిజాన్ని పెంపొందించి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యం, భవిష్యత్ కార్యాచరణ సంప్రదాయ వైద్య నిపుణులతో భాగస్వామ్యం పెంచి సమగ్ర ఆరోగ్య సంరక్షణను ప్రధాన వైద్య విధానంగా రూపొందించేందుకు టీ కన్సల్ట్ కృషి చేయనుంది.టీకన్సల్ట్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ పట్ల నిబద్ధతటీకన్సల్ట్ కొలబ్రెషన్ కాన్ క్లేవ్ 2025 విజయవంతంగా ముగియడం, ప్రపంచవ్యాప్తంగా సమగ్ర ఆరోగ్య విధానాల స్వీకరణ పెరుగుతున్నదనాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఆధునిక వైద్యం, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి మరియు ఇతర సంప్రదాయ వైద్య విధానాలను సమగ్రంగా అందించే లక్ష్యంతో టీకన్సల్ట్ తన ప్రస్థానాన్ని కొనసాగించనుంది.

# అంత్యక్రియలకు ఆర్థికసాయం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ కాలనీలో నివసించే అంజయ్య(62) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా రూ.5,000లు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జి.రవి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైష్ణవి టెక్నో స్కూల్ లో ఘనంగా వసంత పంచమి వేడుకలు




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్ పురికాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో వసంత పంచమి (సరస్వతి అమ్మవారి పుట్టినరోజు) వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి భక్తి శ్రద్ధలతో సరస్వతీ మాతను పూజించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్యలు, నానమ్మ తాతయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ సి.హెచ్.నర్సింహులు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్తులో చిన్నారులంతా అత్యున్నత స్థాయికి ఎదుగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించక నిర్లక్ష్యం చేస్తుంది

* **కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించక నిర్లక్ష్యం చేస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పై వివక్ష చూపి నిధుల కేటాయింపు లో అన్యాయం చేసినందుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ వల్ల సామాన్యులకు లబ్ధి చేకూర పోగా రాష్ట్రం అడిగిన నిధులకే ఎలాంటి కేటాయింపులు జరగలేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది బిజెపి ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ కేంద్రం నుంచి తెచ్చింది ఏమీ లేదని ఆరోపించారు. ఈ కార్యాక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి , జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ళ లక్ష్మీ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సదానందం, సీనియర్ యువజన నాయకులు బొంగునూరి కిశోర్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, జీహెచ్ఎంసీ 8 డివిజన్ల అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా షేక్ రఫియా బేగం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు కడియాల ఇందిరా, నియోజకవర్గ సీనియర్ నాయకులు, సంఘాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కార్యకర్తలు, యూత్ ప్రెసిడెంట్లు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్రం సమావేశం

తెలంగాణ బ్యూరో : సమన్వయంతో ఇరు తెలుగు రాష్ట్రాలు సమస్యలను పరిష్కరించుకోవాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సూచించారు. రెండు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మద్దతు ఉంటుందని హోం శాఖ తెలిపింది. నిధుల పంపకాల్లో సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉండాలని హోం శాఖ సూచించింది. రాష్ట్ర విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ భేటి అయ్యారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌సహా ఇతర ఉన్నతాధికారులు భేటి అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న విభజన చట్టం అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన జరిగిన పదేండ్లు అయిన తరువాత కూడా ఇంకా సమస్యలు ఉండటంపై కేంద్ర హోం శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం 3వ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7డివిజన్ 191 ఎన్టీఆర్ నగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం 3వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లు ముఖ్యఅతిధులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎంతో శక్తివంతమైన ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని, అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సుజాత, నాయకులు సాంబాశివా రెడ్డి, జలగం చంద్రయ్య శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్, ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ ముదిరాజ్, కమిటీ సభ్యులు రామ్ భ్రమ చారీ, కొండా బాబు, రాజు, ఆనంద్, బాలాజీ, నాగేశ్వర్ రావు, 191 ఎన్టీఆర్ నగర్ ప్రెసిడెంట్ రాజేష్,191 ఎన్టీఆర్ నగర్ మహిళా అధ్యక్షురాలు శోభరణి, సంక్షేమ సంఘం , దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు రిమాండ్

* రూ. 4 లక్షల విలువ చేసే ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ఓఎల్ఎక్స్లో అమ్మకానికి పెట్టిన బైక్లను కొనుగోలు చేస్తామని వచ్చి టెస్ట్ డ్రైవ్ చేస్తామని వాహనాలతో ఉడాయించిన ఇద్దరు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. సోమవారం షాపూర్నగర్ లో గల బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్, బాచుపల్లి సిఐ ఉపేందర్ , డీఐ యాదయ్యలు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ...... బాచుపల్లి కౌసల్య కాలనీలో నివాసం ఉంటున్న మహేష్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ . తన బైక్ ను విక్రయించేందుకు ఓఎల్ఎక్స్లో పోస్టు చేశాడు. ఇది చూసిన సూరారం కు చెందిన ఒంగోలు రమేష్ బాబు (27) మరో ఇద్దరు చంద్రమోలు గుండప్ప (23) , నరసింహా (22)లతో కలిసి జనవరి 23న మహేష్ ఇంటికి వెళ్ళి మహేష్తో మాట్లాడారు. బైక్ ను కొంటాం టెస్ట్ డ్రైవ్ చేస్తానంటూ తీసుకెళ్ళి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన మహేష్ అదే రోజు బాచుపల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఆధారంగా ఆదివారం చోరి చేసిన బైక్ పై తిరుగుతుండగా పోలీసులు గుర్తించి రమేష్ను, గుండప్పలను అరెస్టు చేసి విచారించగా బాచుపల్లిలో మరో 3, మియాపూర్ లో 2, జగద్గిరిగుట్టలో 1 చోరి చేసినట్లు ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 4 లక్షల విలువ చేసే ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ కు తరలించారు. మరో వ్యక్తి నర్సింహ పరారిలో ఉన్నారు.

## నేను తెలంగాణకు వచ్చేవరకు ఎవరూ మీడియాతో మాట్లాడొద్దు.. ఎమ్మెల్యేలకు మున్షీ ఆదేశం



తెలంగాణ బ్యూరో: తెలంగాణ కాంగ్రెస్లో ఎమ్మెల్యేల రహస్యం సమావేశం దూమారం రేపుతున్నది. ఈ మీటింగ్విషయంలో ఎవరు మాట్లాడొద్దని పీసీసీ ఆదేశాలు జారీ చేసినా కొంత మంది ఎమ్మెల్యులు మీడియా ముందుకు వచ్చి మాట్లాడటంపై హైకమాండ్ ఆగ్రహంతో ఉన్నట్లు పార్టీలో టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్చార్జీ దీపాదాస్మున్షీ పలువురు ఎమ్మెల్యేలకు ఫోన్చేసిన ఆరా తీసినట్లు తెలిసింది. ఈనెల 5వ తేదీన తెలంగాణ వస్తున్నానని, అప్పటివరకు ఎవరి ఎక్కడ మీడియాతో ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల రహస్య భేటీపై కాంగ్రెస్ అధిష్ఠానం ఈ అంశాన్ని తేలికగా తీసుకోవద్దని, యుద్ధ ప్రాతిపదికన జోక్యం చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ అంశం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్మున్షీ వద్దకు చేరడంతో సీరియస్అయినట్లు తెలిసింది. ఎమ్మెల్యేల భేటీలో కీలకంగా వ్యవహరించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్రెడ్డి ఇటీవల ఓ మీడియాతో మాట్లాడటంతో ఈ విషయంలో మరింత రచ్చకెక్కవచ్చనే భావనతో ఇంతటితో ముగింపు చేసేందుకు హస్తిన పెద్దలు రంగంలోకి దిగినట్లు పార్టీలో చర్చ సాగుతోంది.

## వైభవంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 54 వ బ్రహ్మోత్సవాలు

* కనుల పండుగగా శ్రీ వారి కళ్యాణ మహోత్సవం
* శ్రీ వారికి ప్రముఖులు పూజలు











జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 54 వ బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకము, ద్వజారోహనము,హోమము,12 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం భక్త జన సందోహం మధ్య కనుల పండుగగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి.వివేకానంద్ ,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి కొలను హనుమంత రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, బిజెపి జిల్లా ఇన్చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, స్థానిక కార్పొరేటర్ కోలుకుల జగన్, గాజులరామరం కార్పొరేటర్ రావుల శేషగిరి రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, బిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణమాచార్యులు, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వారి బ్రహ్మోత్సవాలకు జగద్గిరిగుట్ట నుండి కాకుండా పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగద్గిరిగుట్ట సిఐ. కె.నరసింహ,ఎస్ఐ.శంకర్ ల నేతృత్యంలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఎటువంటి అ సౌకర్యాలు జరగకుండా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,సంబంధిత దేవాలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం,స్థానిక ఆర్యవైశ్య సంఘం,ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు,గుట్ట వైశ్య సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి,ధర్మకర్తలు,వైశ్య సంఘం ప్రతినిధులు ఉప్పల రమేష్ గుప్తా,రేగురి ప్రవీణ్ కుమార్ గుప్తా,తేరాల శ్రీనివాస్ గుప్తా, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు బాబుగౌడ్, శశిధర్, జైహింద్, మెట్ల శీను, బండ మహేందర్, అంజనేయులు యాదవ్, వెంకటేష్, దాసు, సుధాకర్, జయకృష్ణ, మహేష్, విఠల్, పాపిరెడ్డి, అజం తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై నివేదిక ఇవ్వాలి : హైకోర్టు




తెలంగాణ బ్యూరో : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యార్థుల వసతి గృహలలో చోటుచేస్తున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై 10 రోజులలో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై అడ్వకేట్ చిక్కుడు ప్రభాకర్ దాఖలు చేసిన పిటిషన్ పై సోమవారం హై కోర్టు విచారించింది. నవంబర్ నెలలో నారాయణ పేట, మాగనూరు , బురుగుపల్లి వసతి గృహలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై చిక్కుడు ప్రభాకర్ పిల్ దాఖలు చేశారు. 6 వారాలలో నివేదికలు సమర్పిచాలని హైకోర్టు డిసెంబర్ 5వ తేదిన ఆదేశించిన 8వారాలు గడుస్తున్న రాష్ట ప్రభుత్వం నివేదిక సమర్పించలేదని ప్రభాకర్ కోర్టుకు వివరించారు. వాదనలు పరిశీలించిన హైకోర్టు 10 రోజులు నివేదిలకలు ఇవ్వాలని ఆదేశాలు చేస్తూ . తదుపరి విచారణ 18వ తేదికి వాయిదా వేసింది.

# ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పూల వర్షం

* మహా కుంభమేళా అత్యంత అట్టహాసంగా కొనసాగుతోంది. ఇప్పటికే కోట్ల మంది భక్తులు, సాధువులు పవిత్ర త్రివేణి సంగమంలో స్నానాలాచరించారు. తాజాగా వసంత పంచమి సందర్భంగా మహా కుంభమేళాలో జరిగిన మూడవ గొప్ప 'అమృత స్నానం'లో, త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం చేస్తోన్న సాధువులు, భక్తులపై హెలికాప్టర్ తో పూల రేకులను కురిపించారు. దీనికి సంబంధించిన విజువల్స్ ను మహా కుంభ్ అధికారిక ఎక్స్ ఖాతాలో వీక్షించవచ్చు. ఇందులో హెలికాప్టర్ గాల్లో విహరిస్తూనే.. గంగానదిలో స్నానాలచరిస్తోన్న వారిపై పూల వర్షం కురిపించడం చూడవచ్చు.



* వసంతి పంచమి సందర్భంగా ఈ రోజు ఇప్పటి వరకు దాదాపు 62 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే రోజు ముగిసేరికి దాదాపు ఐదు కోట్ల మంది యాత్రికులు వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది.



# ఢిల్లీ ఎన్నికలు.. ఎగ్జిట్ పోల్స్ నిషేధం

- ఎన్నికల సందర్భంగా నిషేధం విధించిన ఈసీ
- ఫిబ్రవరి 5 న సాయంత్రం 6.30 వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం




**నేషనల్ బ్యూరో:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లోని ఒక్కో అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నికల కు సంబంధించిన పోలింగ్ ఫిబ్రవరి 5న జరగనుంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5న ఎగ్జిట్ పోల్స్ ఇతర సర్వేలపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఈ మేరకు ఈసీ ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీచేసింది. పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి 5న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ ప్రచురణపై నిషేధం విధించినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. ఫిబ్రవరి 5న పోలింగ్ ముగింపు సమయానికి ముందు 48 గంటల పీరియడ్‌లో ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి వార్తలనుగానీ, ఒపీనియన్ పోల్ వివరాలను గానీ, ఇతర పోల్ సర్వేల వివరాలను గానీ ప్రచురించడానికి, ప్రదర్శించడానికి వీల్లేదని కూడా ఈసీ తన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఉత్తరప్రదేశ్‌లోని మిల్కిపూర్ అసెంబ్లీ స్థానానికి, తమిళనాడులోని ఈరోడ్ అసెంబ్లీ స్థానానికి ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మెజారిటీతో గెలిచింది. 70 సీట్లలో 2015లో ఆప్ 67 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ కేవలం 3 సీట్లకు పరిమితం కాగా, కాంగ్రెస్ అసలు ఖాతానే తెరవలేదు. 2020లో కూడా ఆప్ హవానే కొనసాగింది. ఆ పార్టీ 62 సీట్లు గెలుచుకోగా.. బీజేపీ మిగిలిన 8 స్థానాలు దక్కించుకుంది. వరుసగా రెండోసారి కూడా కాంగ్రెస్‌కు రిక్త హస్తమే మిగిలింది.



## ఆఖరి రోజు జోరుగా ప్రచారం

- ఢిల్లీ విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని నరేంద్ర మోదీ

నేషనల్ బ్యూరో: మరో రెండు రోజుల్లో దేశ రాజధాని ఢిల్లీకి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రచారానికి సోమవారమే ఆఖరు తేదీ కావడంతో రాజకీయం వేడెక్కింది. చివరి రోజు ప్రధాన పార్టీలన్నీ జోరుగా ప్రచారం చేపట్టాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా కొంతమంది ఢిల్లీ విద్యార్థులతో ముచ్చటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తమ విజయంగా చెప్పే విద్యా విధానంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. ఢిల్లీ పాఠశాలల్లో 9వ తరగతి దాటి చదివేందుకు అందరు విద్యార్థులను వారు (ఆమ్ ఆద్మీ పార్టీ) అనుమతించడం లేదని విన్నాను. కేవలం పాస్ అవుతారన్న గ్యారంటీ ఉన్నవారిని మాత్రమే పైతరగతులకు పంపిస్తున్నారట. ఎందుకంటే రిజల్ట్ సరిగా రాకపోతే.. ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు. ఇలా విద్యా వ్యవస్థలోనూ వారు అవినీతికి పాల్పడుతున్నారు" అని విద్యార్థులతో ప్రధాని అన్నారు. ఆప్ ప్రతిష్ఠను పెంచుకునేందుకు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మోదీ దుయ్యబట్టారు.



## కుంభమేళా తొక్కిసలాట
# దురదృష్టకరం

- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- అధికారులపై చర్యలు తీసుకోవాలన్న పిటిషన్ తిరస్కరణ

**నేషనల్ బ్యూరో:** కుంభమేళా తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, ఆందోళన కలిగించే విషయమని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఈ ఘటనకు సంబంధించి ఉత్తర ప్రదేశ్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ, దేశవ్యాప్తంగా వచ్చే భక్తుల భద్రత విషయంలో ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిల్ను తిరస్కరించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా లో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ విశాల్ తివారీ అనే న్యాయవాది సుప్రీంలో పిల్ వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అందులో కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్లో ప్రస్తావించారు. దీనిపై యూపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గా వాదనలు వినిపించారు. ఈ ఘటనపై జ్యుడీషియల్ దర్యాప్తు జరుగుతోందని, ఇదేతరహాలో ఓ పిల్ హైకోర్టులో దాఖలైందని సుప్రీంకు తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తాజా ఆదేశాలు.




## తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలపై ఉత్కంఠ

**ఏపీ బ్యూరో:** తిరుపతి నగరపాలక డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఎస్వీ వర్సిటీ సెనెట్ హాల్లో కాసేపట్లో ఈ ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో భారీగా పోలీసుల మోహరించారు. ఎస్వీయూ ప్రధాన గేటు వద్ద పోలీసులు తనిఖీలు చేసి కార్పొరేటర్లను లోపలికి పంపుతున్నారు. పరిపాలనా భవనం వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరోవైపు ఎస్వీ వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైకాపా కార్యకర్తలు సెనెట్ హాల్కు చేరుకున్నారు. వారి బస్సుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు.

**గుంటూరులో..**

గుంటూరు నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఇక్కడ మొత్తం 57 డివిజన్లు ఉన్నాయి. వైకాపాకు 46, తెదేపాకు 9, జనసేనకు ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నారు.

ఇప్పటి వరకు 6 స్థాయీ సంఘం సభ్యుల పదవులను వైకాపా ఏకగ్రీవం చేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తెదేపా, జనసేనలో పలువురు వైకాపా కార్పొరేటర్లు చేరారు. తొలిసారి స్థాయీసంఘం ఎన్నికలు జరుగుతుండటంతో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వెలువడే ఫలితాలతో ఉత్కంఠకు తెరపడనుంది.

**నందిగామలో..**

నందిగామలో పురపాలక సంఘం చైర్పర్సన్ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. స్థానిక ఫంక్షన్ హాల్లో ఎన్నిక నిర్వహించనున్నారు. ఇక్కడ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నందిగామ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు ఉండగా ఇద్దరు కౌన్సిలర్లు చనిపోయారు . 18 మంది కౌన్సిలర్లు, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వైకాపాకు చెందిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ఎక్స్

## హిందూపురం మున్సిపాలిటీ టీడీపీ కైవసం

- ఓటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి
- మున్సిపల్ చైర్మన్ గా రమేశ్ ఎన్నిక
- ఎలూరులో రెండు స్థానాలు టీడీపీకే



**ఏపీ బ్యూరో:** హిందూపురం మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ ఆరో వార్డు కౌన్సిలర్ రమేశ్ ఎన్నికయ్యారు. ఆయనకు 23 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎంపీ పార్థసారథి పాల్గొన్నారు. 40 మంది సభ్యులున్న కౌన్సిల్లో 23 మంది మద్దతు పలకడంతో మున్సిపల్ ఛైర్మన్ గా రమేశ్ ఎన్నికయ్యారు. వైసీపీ అభ్యర్థి లక్ష్మికి అనుకూలంగా 14 ఓట్లు పడ్డాయి. ముగ్గురు సభ్యులు గైర్హాజరయ్యారు.కౌన్సిల్లో 23 మంది మద్దతు పలకడంతో మున్సిపల్ ఛైర్మన్ గా రమేశ్ ఎన్నికయ్యారు. వైసీపీ అభ్యర్థి లక్ష్మికి అనుకూలంగా 14 ఓట్లు పడ్డాయి. ముగ్గురు సభ్యులు గైర్హాజరయ్యారు.

**ఏలూరులో రెండు స్థానాలు టీడీపీకే**

ఏలూరు డిప్యూటీ మేయర్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. వీటిని టీడీపీ కైవసం చేసుకుంది. మొదటి డిప్యూటీ మేయర్ ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో డిప్యూటీ మేయర్గా దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. నెల్లూరు డిప్యూటీ మేయర్ టీడీపీ మద్దతు అభ్యర్థి తహసీన్ ఎన్నికయ్యారు. 29 ఓట్ల మెజారిటీతో ఆమె ఎన్నికయ్యారు. ఆమె 41 ఓట్లు, వైసీపీ అభ్యర్థి కరీముల్లాకు 12 ఓట్లు వచ్చాయి. తహసీన్ గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. ఆమెకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి నారాయణ ఆలోచనతో మైనార్టీ అభ్యర్థిని పెట్టారని.. తాను బలపరిచినట్లు చెప్పారు.

## ఏపీ విభజన అంశాలపై కీలక సమావేశం

**నేషనల్ బ్యూరో:** ఉమ్మడి ఏపీ విభజన అంశాలపై కేంద్రహోంశాఖ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ సీఎస్ లు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య ఇంకా పరిష్కారం కాని ప్రధానాంశాలపై అధికారులు చర్చిస్తున్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైనా ఈ భేటీలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

## ఎన్నికల సంఘం తీరుపై ఈసీ ఆగ్రహం

- ఎన్నికల కమిషనర్ కు బీజేపీ గవర్నర్ పదవి ఆఫర్ ఇచ్చిందని తీవ్ర ఆరోపణలు
- సీఈసీ తన విధులు న్యాయబద్ధంగా నిర్వర్తించాలని డిమాండ్
- దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు




**నేషనల్ బ్యూరో:** ఆర్ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందు ఈసీ లొంగిపోవడం చూస్తుంటే స్వతంత్ర సంస్థ తన ఉనికిని పూర్తిగా కోల్పోయినట్లు తెలుస్తోందన్నారు. ఈ నెలాఖరుకు రిటైర్ అవుతున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కు భాజపా ఏ పదవిని ఆఫర్ చేసిందని ప్రశ్నించారు. "ఏ గవర్నర్ పదవినో లేదా రాష్ట్రపతి పదవినో ఇస్తామని భాజపా ఆయనకు హామీ ఇచ్చి ఉంటుంది. అందుకే పదవీకాంక్షతో దేశ ప్రజాస్వామ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తున్నారు" అని కేజీవాల్ ఎన్నికల కమిషనర్ పై ఆరోపణలు చేశారు. ఇకనైనా వ్యక్తిగత ప్రయోజనాలపై ఆలోచనలను వీడి చివరి కొద్ది రోజులైనా సీఈసీ తన విధులను న్యాయబద్ధంగా నిర్వర్తించాలని కోరుతున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో భాజపా గూండాలు, ఆప్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారని కేజీవాల్ అన్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకోవడానికి ఢిల్లీ పోలీసులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఒకవైపు తాము ఢిల్లీ ప్రజల అభివృద్ధికి పాటుపడుతూ నెలకు రూ.25,000 ఆదా చేస్తుంటే..మరోవైపు ఇతర పార్టీలు దేశ రాజధానికి సమస్యలు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

## ఆప్ పాలనలో ఢిల్లీలో కనీస వసతులు కరవు

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శలు
- ఐదేళ్ల ఆప్ పాలనలో అభివృద్ధిని మరిచిపోయారు
- కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఢిల్లీలోనూ పాగా వేయాలని చూస్తోంది



**నేషనల్ బ్యూరో:** ఆప్ పాలనలో దేశ రాజధాని అభివృద్ధిలో వెనకపడిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. వారి పాలనలో ఢిల్లీకి దక్కిన ఫలితం చెత్త, విషపు నీరు అని ఎద్దేవా చేశారు. ప్రజలకు సొంత నివాసాలను, మౌలిక సదుపాయాలను కల్పిస్తానని నమ్మించి కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చారని అన్నారు. కానీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదని మండిపడ్డారు. తాను మాత్రం వేల కోట్ల ప్రజాధనంతో శీష్ మహల్ నిర్మించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లిన ఏకైక విద్యాశాఖ మంత్రిగా సిసోదియా చరిత్ర సృష్టించారని అన్నారు. ఇటువంటి వారికి మళ్లీ అధికారం ఇస్తే ఢిల్లీ పూర్తిగా నాశనం అవుతుందని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే.. ఢిల్లీని ప్రపంచస్థాయి రాజధాని నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈక్రమంలో రెండుసార్లు గెలుపొందిన ఆప్.. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఢిల్లీలోనూ ఎలాగైనా పాగా వేయాలని ఆశిస్తోంది. దేశ రాజధానిలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని కాంగ్రెస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కాగా నేటితో ప్రచారాల పర్వం ముగియనున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాలు

## పార్లమెంటులో రభస

**నేషనల్ బ్యూరో:** కుంభమేళాలో మౌని అమావాస్య రోజున జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను పార్లమెంట లో విపక్షాలు లేవనెత్తాయి. సోమవారం ఉభయ సభలు ప్రారంభం అయిన వెంటనే పెద్దఎత్తున నిరసనలు చేపట్టడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనను లోక్సభ స్పీకర్ తీవ్రంగా ఖండించారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయొద్దని, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత ఆ ఘటన గురించి ప్రస్తావించాలని స్పీకర్ ఆదేశించినప్పటికీ.. నినాదాలు ఆగలేదు. ఈ పరిస్థితుల మధ్యే లోక్సభ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి "ఇక్కడ టేబుల్స్ విరగ్గొట్టేందుకు ప్రజలు మిమ్మల్ని గెలిపించలేదు. మీరు బల్లలు పగలగొట్టడానికే ఇక్కడికి వచ్చిఉంటే.. వాటిని ఇంకా గట్టిగా కొట్టండి" అని విపక్ష ఎంపీలకు స్పీకర్ చురకలు అంటించారు. మరోవైపు రాజ్యసభలో కూడా నిరసనలు వినిపించాయి. తర్వాత విపక్ష ఎంపీలు ఎగువ సభ నుంచి వాకౌట్ చేశారు. ఇదిలాఉంటే.. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఈ రోజు చర్చ ప్రారంభమైంది.

## మణిపూర్ అల్లర్ల వెనక ఆడియోల విడుదల

- సీఎం హస్తం ఉన్నట్లు ఆరోపణలు
- విచారణ చేపట్టిన న్యాయస్థానం
- ఫోరెన్సిక్ రిపోర్టు అందించాలని ఆదేశం
- ఇప్పటి వరకు 250 మందికి పైగా అల్లర్లలో మృతి



**నేషనల్ బ్యూరో:** జాతుల మధ్య వైరంతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ రగిలిపోతోంది. హింసను ప్రేరేపించడం వెనక ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ హస్తం ఉందంటూ ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి ఆడియోలు కూడా లీక్ అయ్యాయి. ఈ ఆడియో క్లిప్కు సంబంధించి ప్రభుత్వ ఫోరెన్సిక్ రిపోర్ట్ను అందించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కు సంబంధించి కొన్ని ఆడియోలు లీక్ అయ్యాయి. దీంతో రాష్ట్రంలో హింసను ప్రేరేపించారని ఆరోపిస్తూ.. కుకి ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్టు సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయస్థానం తాజాగా విచారణ చేపట్టింది. ఆడియో క్లిప్లను దేశంలోని స్వతంత్ర ఫోరెన్సిక్ ల్యాబ్ అయిన 'ట్రూత్ ల్యాబ్స్' పరిశీలించిందని పిటీషనర్ తరపు న్యాయవాది తెలిపారు. అందులోని వాయిస్.. సీఎం గొంతుతో 93 శాతం మ్యాచ్ అయినట్లు తేల్చిందన్నారు.వాదనలు విన్న అనంతరం.. ఈ ఆడియోలకు సంబంధించి ఫోరెన్సిక్ రిపోర్ట్ను అందించాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రభుత్వ ఫోరెన్సిక్ లాబొరేటరీ సీఎఫ్ఎస్ఎల్కు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. కాగా.. జాతుల మధ్య వైరంతో ఏడాదిన్నరకాలంగా మణిపూర్ అట్టుడుకుతోంది. హింస కారణంగా ఇప్పటివరకు 250 మందికి పైగా కోల్పోయారు. ఈ హింసను నిలువరించేందుకు ప్రభుత్వం శాయశకులా ప్రయత్నాలు

## దేశంలో నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోంది

- విపక్ష నేత రాహుల్ గాంధీ
- లోక్ సభలో కేంద్రం తీరుపై విరుచుకుపడ్డ ప్రతిపక్ష ఎంపీ
- రాష్ట్రపతి ప్రసంగంలో కొత్త విషయాలు ఏమీ లేవని ఆక్షేపణ



**తెలంగాణ బ్యూరో:** దేశంలో నిరుద్యోగం తాండవం చేస్తోందని విపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇవాళ ఆయన లోక్సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసిందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంలో కొత్త విషయాలు ఏవి లేవని ఆక్షేపించారు. నేటికి దేశాన్ని నిరుద్యోగ సమస్య పట్టి పీడిస్తోందని కామెంట్ చేశారు. మేకిన్ ఇండియా వల్ల ఎలాంటి మార్పు జరగలేదని.. ఎక్కడ వేసిన గొంగడి అక్కే ఉందని ఎద్దేవా చేశారు.అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆ దిశగా కృషి చేయలేదని తాను చెప్పడం లేదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో తయారీ రంగా పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. మేకిన్ ఇండియా (ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. భారతదేశం మొత్తం చైనా దిగుమతులపై ఆధారపడుతోందని ఫైర్ అయ్యారు. మేకిన్ ఇండియాతో పెద్దగా ఒరిగింది ఏమీ లేదని అన్నారు. చాలా సంస్థలు ఉత్పత్తులను పెంచడానికి ప్రయత్నించాయని, కానీ తయారీ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేక పోయామని ధ్వజమెత్తారు. అదేవిధంగా సామాజిక అశాంతి కూడా పెరిగిందని.. దీనిపై మోదీ సర్కార్ సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# నష్టాలతో ముగిసిన భారత స్టాక్ మార్కెట్

**వివిధ దేశాలపై టారిఫ్ పెంచిన ట్రంప్**

**అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు**

**భారత స్టాక్ మార్కెట్ సూచీలపై ప్రభావం**




**ముంబై:** రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడైన నిర్ణయాలు తీసుకుంటుండడంతో ప్రపంచ వాణిజ్య రంగం కుదుపులకు గురవుతోంది. వివిధ దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సుంకాలు పెంచడం అంతర్జాతీయ మార్కెట్లను ప్రభావితం చేస్తోంది. దాంతో, భారత స్టాక్ మార్కెట్ కూడా గత కొన్నిరోజులుగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల పవనాలు వీస్తుండడంతో, భారత స్టాక్ మార్కెట్ సూచీలు నేడు నష్టాల్లో ముగిశాయి. ఈ సాయంత్రం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 319 పాయింట్లు నష్టపోయి 77,186 వద్ద ముగిసింది. నిఫ్టీ 121 పాయింట్లు కోల్పోయి 23,361 వద్ద స్థిరపడింది. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, మారుతి సుజుకీ, బజాజ్ ఫిన్ సర్వ్, ఎయిర్ టెల్ షేర్లు లాభాల బాటలో పయనించగా... టాటా మోటార్స్, ఎల్ అండ్ టీ, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి.

# డాలర్‌తో పోలిస్తే ఆల్ టైం కనిష్టానికి రూపాయి..



**న్యూఢిల్లీ:** కెనడా, మెక్సికో, చైనాలపై ట్రంప్ సుంకాలు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధం భయాలను రేకెత్తించాయి. దీంతో సోమవారం (ఫిబ్రవరి 3, 2025) భారత రూపాయి విలువ 67 పైసలు తగ్గి డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ట స్థాయి 87.29కి చేరుకుంది. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాల విధింపు నిర్ణయాల కారణంగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధం ఆందోళనలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో 2025 ఫిబ్రవరి 3న భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే 87.29కి పతనమైంది. ఈ క్రమంలో అత్యంత కనిష్ట స్థాయికి చేరుకుంది. ట్రంప్ అధిక సుంకాల విధింపులు, అమెరికా డాలర్‌కు ఉన్న అధిక డిమాండ్ వల్ల ఇది జరిగిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

**ట్రంప్ బెదిరింపులు..**

ట్రంప్ సుంకాల బెదిరింపులు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల కరెన్సీలను ప్రభావితం చేశాయి. దీంతో డాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రూపాయి మరింత పతనమైంది. ముఖ్యంగా చమురు దిగుమతులు, డాలర్ క్రయవిక్రయాల నేపథ్యంలో అమెరికా డాలర్ సూచిక వృద్ధి చెందడం వల్ల భారత రూపాయి మరింత బలహీనంగా మారింది. రూపాయి విలువ 87.29 వద్ద ప్రారంభమైంది. ఇది శుక్రవారం ముగింపుతో పోలిస్తే 67 పైసలు తగ్గింది. ఇక డాలర్ విషయానికి వస్తే ఇండెక్స్ 109.77 వద్ద ట్రేడవుతోంది, ఇది గతంతో పోలిస్తే 1.30 శాతం పెరిగింది.

**ఇతర దేశాల కరెన్సీలు కూడా..**

ఈ పరిణామాలు యూరో, యెన్, ఇతర ఆసియా కరెన్సీలపై కూడా ప్రభావం చూపించాయి. యూరో 1.0224, 1.2261, జపాన్ యెన్ 155.54కి పడిపోయాయి. ఈ సమయంలో బ్రెంట్ క్రూడ్ చమురు ధరలు 0.71 శాతం పెరిగి 76.21కి చేరుకున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్‌లో మరిన్ని మార్పులను సూచిస్తుంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కెనడా, మెక్సికో, చైనాపై సుంకాలు విధించి, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతను సృష్టించారని నిపుణులు చెబుతున్నారు.

**ఈ సుంకాల విషయంలో..**

ఇప్పటికే కెనడా, మెక్సికో తమపై విధించిన సుంకాలకు ప్రతీకారంగా సమాధానమిచ్చే ప్రయత్నాలు చేశాయి. అయినప్పటికీ ఈ పరిస్థితులు ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితిని పెంచి, భారత రూపాయిపై ఒత్తిడి తెచ్చాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నిర్ణయాల విషయంలో వెనక్కి తగ్గుతారా లేదా ఇలాగే కొనసాగిస్తారా లేదా అనేది చూడాలి. ఇలాగే కొనసాగితే ప్రపంచ మార్కెట్లకు ఇబ్బంది తప్పదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ బిగ్ షాక్

**లెవల్ 80 వరకు ఉద్యోగుల పనితీరును ఇటీవల విశ్లేషించిన మైక్రోసాఫ్ట్**

**ఉద్యోగులు తమ స్థాయికి తగిన కనీస పనితీరు ప్రమాణాలను అందుకోలేని కారణంగా తొలగిస్తున్నట్లు లేఖలు జారీ చేసిన మైక్రోసాఫ్ట్**




**న్యూఢిల్లీ:** అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులకు మరో సారి షాక్ ఇచ్చింది. ఇటీవలే సెక్యూరిటీ, డివైజ్, సేల్స్, గేమింగ్ విభాగాల్లోని ఉద్యోగులపై వేటు వేసిన మైక్రోసాఫ్ట్ .. తాజాగా పనితీరు మెరుగుపడని ఉద్యోగులపై చర్యలు తీసుకుంది. ఈ విషయాన్ని బిజినెస్ ఇన్‌సైడర్ పత్రిక వెల్లడించింది. కంపెనీలో జూన్ 2024 నాటికి 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, ఇటీవల లెవల్ 80 వరకు ఉద్యోగుల పనితీరును విశ్లేషించింది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులను తక్షణమే కొలువుల నుంచి తప్పించిందని బిజినెస్ ఇన్‌సైడర్ కథనంలో పేర్కొంది. ఉద్యోగులు తమ స్థాయికి తగిన కనీస పనితీరు ప్రమాణాలను అందుకోలేని కారణంగా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు వారికి పంపిన లేఖల్లో పేర్కొంది. తొలగింపునకు గురైన వారికి మెడికల్, ప్రిస్ క్రిప్షన్, డెంటల్ హెల్త్ కేర్ ప్రయోజనాలు వెంటనే నిలిచిపోతాయని పేర్కొంది. కొందరు ఉద్యోగులకు సర్వీస్ పే కూడా చెల్లించనట్లు తెలుస్తోంది. తక్షణమే అన్ని విధుల నుంచి రిలీవ్ చేస్తున్నామని, మైక్రోసాఫ్ట్ సిస్టమ్స్, అకౌంట్స్, బిల్డింగ్‌లలోకి యాక్సెస్‌ను తొలగించినట్లు తెలిపింది. అయితే ఎంత మంది ఉద్యోగులను తొలగించారనేది తెలియరాలేదు. అంతే కాకుండా మళ్లీ ఇదే కంపెనీలో కొత్త ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటే గతంలో ఆ ఉద్యోగి పనితీరు, టర్మినేషన్‌కు గురైన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని వారికి మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది.

# టీ20 క్రికెట్‌లో సరికొత్త రికార్డు!



**చరిత్ర సృష్టించిన ఆండ్రీ రసెల్..**

**టీ20ల్లో అత్యంత వేగంగా 9వేల రన్స్ పూర్తి చేసిన ఆటగాడిగా రసెల్ రికార్డు**

**కేవలం 5,321 బంతుల్లోనే ఈ మైలురాయిని అందుకున్న కరేబియన్ స్టార్**

**అంతకుముందు ఈ రికార్డు ఆసీస్ ప్లేయర్ మ్యాక్స్‌వెల్ (5,915) పేరిట**

**ఓవరాల్‌గా టీ20ల్లో 9వేల పరుగులు పూర్తి చేసిన 25వ ప్లేయర్ రసెల్**

వెస్టిండీస్: వెస్టిండీస్ ప్లేయర్ ఆండ్రీ రసెల్ టీ20ల్లో చరిత్ర సృష్టించాడు. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 9వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా సరికొత్త రికార్డుకెక్కాడు. రసెల్ కేవలం 5,321 బంతుల్లోనే ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. అంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ (5,915) పేరిట ఉండేది. ప్రస్తుతం యూఏఈలో జరుగుతున్న ఐఎల్‌టీ20 టోర్నీలో ఈ కరేబియన్ ఆటగాడు ఆడుతున్నాడు. అబుదాబి నైట్ రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. శనివారం నాడు గల్ఫ్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. వీరిద్దరి తర్వాత ఈ ఘనత సాధించిన వారిలో ఏబీ డివిలియర్స్ (5,985 బంతులు), కీరన్ పొలార్డ్ (5,988 బంతులు), క్రిస్ గేల్ (6,007 బంతులు), అలెక్స్ హేల్స్ (6,175 బంతులు) ఉన్నారు.

రసెల్ టీ20 కెరీర్ గణాంకాలు ఇలా..

ఈ విధ్వంసకర బ్యాటర్ మొత్తం 536 మ్యాచుల్లో 9,004 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా టీ20ల్లో 9వేల పరుగులు పూర్తి చేసిన 25వ ప్లేయర్ రసెల్ కావడం గమనార్హం. అతని 26.79 సగటు, 169.15 అద్భుతమైన స్ట్రైక్ రేట్ తో ఈ జమైకన్ ఆల్ రౌండర్ తన కెరీర్‌లో ఇప్పటి వరకు 31 అర్ధ సెంచరీలు, రెండు సెంచరీలు సాధించాడు. ఇక క్రిస్ గేల్ కేవలం 463 మ్యాచుల్లో 14,562 పరుగులతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. అటు బౌలింగ్‌లోనూ ఆండ్రీ రసెల్ అద్భుతమైన గణాంకాలు కలిగి ఉన్నాడు. అతను తన టీ20 కెరీర్‌లో 25.55 సగటు, 8.71 ఎకానమీతో 466 వికెట్లు తీశాడు.

# బంగ్లాదేశ్ క్రికెట్ టీమ్ పరువు తీసేసిన బస్ డ్రైవర్

**జీతం చెల్లించలేకపోవడంతో క్రికెటర్ల కిట్లకు తాళమేసిన వైనం**

**బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ల సందర్భంగా ఘటన**

**ఆర్థిక కష్టాల్లో బంగ్లాదేశ్ ఫ్రాంచైజీ.. హొటల్ బిల్లులు కూడా చెల్లించలేదట**



**ఢాకా:** బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) లో ఓ ఫ్రాంచైజీని ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. ఆటగాళ్లను హొటల్ నుంచి మైదానానికి తీసుకువెళ్లే బస్ డ్రైవర్ కు జీతం ఇచ్చేందుకూ ఫ్రాంచైజీ వద్ద సొమ్ము లేదట. దీంతో చిర్రెత్తుకుపోయిన డ్రైవర్ క్రికెటర్ల కిట్ లకు తాళం వేశాడు. తన జీతం ఇస్తేనే తాళం తీస్తానని పట్టుబట్టాడు. డ్రైవర్ పరిస్థితి ఇలా ఉండగా సదరు ఫ్రాంచైజీ తరఫున ఆడుతున్న విదేశీ ఆటగాళ్లు వారి స్వదేశానికి వెళ్లలేకపోతున్నారట. వారు బస చేసిన హొటల్ బిల్లులు చెల్లించకపోవడంతో క్రికెటర్లు చెక్ ఔట్ చేయడానికి ఆయా హొటళ్ల యాజమాన్యాలు అంగీకరించడంలేదు.

బీపీఎల్ లో దర్బార్ రాజ్‌షాహి జట్టు ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. జట్టు తరఫున ఆడిన క్రికెటర్లకు పేమెంట్ చేయడానికి డబ్బుల్లేవంటూ చేతులెత్తేసింది. ఈ ఘటనపై బస్ డ్రైవర్ మహమ్మద్ బాబుల్ మాట్లాడుతూ.. టోర్నీ జరిగినన్ని రోజులు ఆటగాళ్లను హొటల్ కు, గ్రౌండ్ కు తిప్పానని చెప్పాడు. బస్ కిరాయితో పాటు తనకు ఇవ్వాల్సిన జీతంలో పెద్ద మొత్తం జట్టు యాజమాన్యం బకాయి పెట్టడం సిగ్గుచేటని అన్నాడు. కిట్లలో స్వదేశీ, విదేశీ ప్లేయర్లకు చెందినవి ఉన్నాయని, తనకు ఇవ్వాల్సిన మొత్తం ఇస్తే తప్ప కిట్ లను ఇవ్వలేనని తేల్చిచెప్పాడు.

# చరిత్ర సృష్టించిన టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి

**ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచుల సిరీస్‌లో 14 వికెట్లు తీసిన వరుణ్**

**ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్‌గా రికార్డు**

**ఓవరాల్‌గా ఓ టీ20 సిరీస్‌లో ఎక్కువ వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా వరుణ్**

**ఈ జాబితాలో వెస్టిండీస్ ఆటగాడు జాసన్ హొల్డర్ 15 వికెట్లతో అగ్రస్థానం**



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగిన టీ20 సిరీస్ ద్వారా టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి చరిత్ర సృష్టించాడు. ఈ ఐదు మ్యాచుల సిరీస్‌లో 14 వికెట్లు తీసిన అతడు.. ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్‌గా రికార్డుకెక్కాడు. 33 ఏళ్ల భారత స్పిన్నర్ ఈ సిరీస్ చివరి గేమ్‌లో 25 పరుగులిచ్చి, 2 వికెట్లు తీశాడు. తద్వారా ఐదు మ్యాచుల సిరీస్‌లో 14 వికెట్ల మార్క్‌ను అందుకున్నాడు.

2021లో ఆస్ట్రేలియాపై న్యూజిలాండ్ స్పిన్నర్ ఇష్ సోధీ 13 వికెట్లు తీయగా, వరుణ్ ఇప్పుడు ఆ రికార్డును బద్దలు కొట్టాడు. ఓవరాల్‌గా ఓ టీ20 సిరీస్‌లో ఎక్కువ వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి నిలిచాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ ఆటగాడు జాసన్ హొల్డర్ 15 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. 2022లో ఇంగ్లండ్‌పై ఈ ఘనత సాధించాడు.

**ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు**

జాసన్ హొల్డర్ (వెస్టిండీస్)- 15
సమీ సోహైల్ (మలావి)- 14
వరుణ్ చక్రవర్తి (భారత్)- 14
ఇష్ సోధి (న్యూజిలాండ్)- 13
చార్లెస్ హింజ్ (జపాన్)-13.

# అభిషేక్ శర్మ రికార్డ్ బ్రేకింగ్ కొట్టుడు... మెంటార్ యువరాజ్ సింగ్ ఇంట్రెస్టింగ్ పోస్ట్!

**ఐదో టీ20లో అభిషేక్ స్వైర విహారం**

**భారీ శతకం తోడు రెండు వికెట్లు తీసిన యంగ్ ప్లేయర్**

**అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న అభిని మెచ్చుకున్న మెంటార్ యువీ**

**'ఎక్స్' వేదికగా ఆసక్తికర పోస్టు.. నెటిజన్ల కామెంట్స్**





**ముంబై:** ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఐదో టీ20లో భారత్ 150 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంలో అభిషేక్ శర్మ అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్ లో అభిషేక్ కేవలం 54 బంతుల్లో 135 పరుగులు చేయగా, బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. అది కూడా ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీయడం విశేషం. అలాగే ఒక క్యాచ్ కూడా పట్టాడు. ఇలా ఓవరాల్‌గా ఆల్ రౌండర్ ప్రదర్శనతో మనోడు మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. దీంతో అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న అభిని అతడి మెంటార్, భారత లెజెండరీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ మెచ్చుకున్నాడు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక పోస్ట్ చేశాడు.

"అభిషేక్ శర్మ బాగా ఆడావు. నేను నిన్ను ఎక్కడ చూడాలనుకున్నానో ఇప్పుడు నీవు అక్కడ ఉన్నావు. నీ గురించి గర్వపడుతున్నాను" అని యువరాజ్ తన పోస్టులో రాసుకొచ్చాడు. ఇప్పుడీ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'గురువుకు తగ్గ శిష్యుడు' అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. అంతకుముందు అభిషేక్ శర్మ ఇదే సిరీస్ తొలి మ్యాచ్ లో 34 బంతుల్లో 79 పరుగులు చేసినప్పుడు కూడా యువీ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. "సిరీస్ లో కుర్రాళ్లకు శుభారంభం! మన బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. సర్ అభిషేక్ శర్మ, టాప్ నాక్ (అదరగొట్టేశావు)!! నువ్వు గ్రౌండ్ లో కొట్టిన రెండు బౌండరీలు నన్ను ఆకట్టుకున్నాయి" అని యువరాజ్ పోస్ట్ చేశాడు.

ఇక నిన్నటి మ్యాచ్‌లో 24 ఏళ్ల అభిషేక్ స్వైర విహారం చేశాడు. కేవలం 17 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఆపై కేవలం 37 బంతుల్లోనే అద్భుతమైన శతకం నమోదు చేశాడు. అభి తుపాను ఇన్నింగ్స్ కారణంగా భారత్ 20 ఓవర్లలో 247/9 భారీ స్కోరును నమోదు చేసింది. ఆ తర్వాత ఇంగ్లండ్‌ను కేవలం 97 పరుగులకే కట్టడి చేసి, ఏకంగా 150 పరుగుల తేడాతో బంపర్ విక్టరీ సాధించింది. అలాగే ఈ విజయంతో భారత్ 4-1తో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది.

టాకీస్: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. మిల్కీ బ్యూటీ భాషతో సంబంధం లేకుండా పలు సినిమాల్లో నటిస్తుంది. సిని ఇండస్ట్రీలో దూసుకుపోతుంది. ఇప్పటికే పలు బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు ఓటీటీలో కూడా అగుడుపెట్టి తన సత్తా చాటుకుంది. మంచు మనోజ్ హీరోగా వచ్చిన 'శ్రీ' అనే మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ అమ్మడు ఆ తరువాత శేఖర్ కమలా డైరెక్షన్ లో వచ్చిన 'హ్యాపీ డేస్' అనే మూవీతో స్టార్ హీరోయిన్ గా మారింది. ఈ హిట్ తో అప్పటినుంచి ఎక్కడ కూడా వెనక్కి తిరిగి చూసుకోకుండా ఇండస్ట్రీలో దూసుకుపోయింది. తెలుగులోనే కాకుండా తమిళంలోనూ వరుస ఆఫర్లు అందుకుంటూ స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకుంటుంది. ఇటీవల డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వంలో వచ్చిన బాక్ మూవీలో నటించింది. ఇక తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన జైలర్ మూవీలో 'కావాలయ్యా..' అంటూ రెచ్చిపోయి.. గ్లామర్ షో లో టాక్ ఆఫ్ దీ సెన్సేషన్ గా మారింది ఈ మిల్కీ బ్యూటీ. ఈ మధ్యనే స్త్రీ 2 సినిమాలో కూడా ఓ ఐటమ్ సాంగ్ నటించి కుర్రకారును చెమటలు పట్టించింది. మిల్క్ బ్యూటీ తమన్నా సినీ ఇండస్ట్రీకి వచ్చి దాదాపు 19 ఏండ్లు అవుతున్న చెక్కుచెదరని గ్లామర్ తన సొంతం. ఈ అమ్మడు బాలీవుడ్ స్టార్ హీరో నటుడు విజయ్ వర్మతో లవ్ ట్రాక్ నడుపుతోందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరిద్దరు త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని బాలీవుడ్ మీడియాలో పలు హాట్ సోర్టీస్ సర్కిలేట్ అవుతున్నాయి. రీసెంట్ గా 'సికందర్ కా ముఖద్దర్' అనే మూవీలో తమన్నా లీడ్ లో నటించింది. ఈ మూవీకి నీరజ్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 29నుండి ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. ఇక 'ఓదెల 2' అనే తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తుంది. హెబ్బా పటేల్ లీడ్ రోల్‌లో నటించిన హిట్ మూవీ 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. దీంతోపాటు కరణ్ జోహార్ బ్యానర్‌పై రూపొందుతున్న 'డేరింగ్ పార్ట్‌నర్స్'లో కూడా నటిస్తోంది.






## 'ది డైరీ ఆఫ్ మణిపూర్'తో తెరంగేట్రం చేసేందుకు సిద్ధమైన మోనాలిసా భోస్లే!

**టాకీస్:** మహా కుంభ మేళాలో వైరల్ అయిన పూసలమ్ముకునే 16 ఏళ్ల అమ్మాయి మోనాలిసా భోస్లే బాలీవుడ్ ఛాన్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. హిందీ సినిమా 'ది డైరీ ఆఫ్ మణిపూర్'తో తెరంగేట్రం చేసేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలో నటించేందుకు మోనాలిసా నుంచి రచయిత, దర్శకుడు సనోజ్ మిశ్రా సంతకం కూడా తీసుకున్నారు. చిత్రీకరణ సైతం ఈ నెలలోనే ప్రారంభం కాబోతోంది. ఈ క్రమంలో తన సినీ ప్రయాణంపై మోనాలిసా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. థియేటర్ బయట అల్లు అర్జున్ పుష్ప-2 పోస్టర్ పక్కన నిలబడిన ఫొటోను మోనాలిసా ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. ఇప్పుడు పోస్టర్ బయట నిలబడ్డానని, త్వరలోనే పోస్టర్‌లో కనిపిస్తానంటూ తెలిపింది. 'ఈ రోజు పోస్టర్ బయట. రేపు పోస్టర్ లోపల. కాలచక్రం అంటే ఇదే. త్వరలోనే ముంబైలో కలుద్దాం. అల్లు అర్జున్ పుష్ప-2' అంటూ' ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు ఆమెకు ఆల్‌ది బెస్ట్ చెబుతూ కామెంట్స్ చేస్తున్నారు.

## రూ. 300 కోట్ల క్లబ్‌లో చేరిన "సంక్రాంతికి వస్తున్నాం"

**టాకీస్:** విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా.. రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అంతేగాకుండా తెలుగులో ఈ రికార్డు సాధించిన తొలి చిత్రంగా రికార్డు



నమోదు చేసింది. మరోవైపు టాలీవుడ్ నుంచి సీనియర్ నటులలో రూ.300 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయిన నటుడిగా వెంకీ మామ రికార్డు సృష్టించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అంతర్జాతీయ స్థాయిలో టాప్ కంపెనీ సీఈఓ సత్య ఆకెళ్ల (అవసరాల శ్రీనివాస్)భారత్ పర్యటనకు వస్తారు. ఈ నేపథ్యంలో తమ రాష్ట్రానికి పెట్టుబడుల కోసం ఆయనను ముఖ్యమంత్రి (నరేశ్) తెలంగాణకు ఆహ్వానిస్తారు. పార్టీ ప్రెసిడెంట్ (వీటీవీ గణేశ్) స్పెషల్ పార్టీ అని సత్య ఆకెళ్లను తన ఫాంహౌస్‌ను తీసుకెళ్లడంతో కొందరు దుండగులు సత్య ఆకెళ్లను కిడ్నాప్ చేసి.. జైల్లో ఉన్న తమ అన్న పప్పా పాండేను విడుదల చేయాలని డిమాండ్ చేస్తారు. ఇక సత్య కిడ్నాప్ అంశం బయటకు వస్తే రాష్ట్ర పరువు పోతుందని భావించిన సీఎం మాజీ పోలీసాఫీసర్ ఐడీ రాజు (వెంకటేశ్)ని తేవాలనుకుంటాడు. అయితే నిజాయితీ గల ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన వైడీ రాజు రాజమండ్రిలో తన భార్య (ఐశ్వర్యరాజేశ్) పిల్లలతో హాయిగా గడుపుతుంటాడు. దీంతో రాజును తీసుకొచ్చేందుకు సత్యకు సెక్యూరిటీ ఇచ్చిన అతని మాజీ ప్రేయసి (మీనాక్షి చౌదరి) వెళ్తుంది. ఇంతకీ రెస్క్యూ ఆపరేషన్ చేసేందుకు వైడీ రాజు ఒప్పుకున్నాడా..? మీనాక్షి, రాజు విడిపోయేందుకు కారణాలేంటి.. ప్రేయసి వచ్చాక రాజు భార్య ఎలా మారింది.. సత్య ఆకెళ్లను కిడ్నాప్ నుంచి రాజు కాపాడాడా..? అన్నదే కథ.

## కన్నప్పలో రుద్రుడిగా ప్రభాస్ .. ఫస్ట్ లుక్ సూపర్బ్

టాకీస్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు కుటుంబం నుంచి వస్తున్న ఈ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ని ప్రకటించింది. ఈ మూవీ నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో రుద్రుడిగా ప్రభాస్ నటించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు, శివాజ్ఞ పరిపాలకుడు అంటూ ప్రభాస్ పోస్టర్‌ని పంచుకుంది. హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ అందుకుంది.




## 'గ్రామీ' అవార్డులో సత్తాచాటిన భారత సంతతి మహిళ

**టాకీస్:** సంగీత రంగంలో ప్రతిష్ఠాత్మకంగా అందించే 67వ 'గ్రామీ అవార్డుల' ప్రదానోత్సవం అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకకు దిగ్గజ సంగీత దర్శకులతో పాటు సింగర్స్ హాజరై సందడి చేశారు. ఇక ఈ అవార్డు వేడుకలలో భారత సంతతికి చెందిన ఇండో-అమెరికన్ సింగర్, వ్యాపారవేత్త చంద్రికా టాండన్ అవార్డు అందుకుంది. చంద్రిక రూపొందించిన 'త్రివేణి' అనే ఆల్బమ్ బెస్ట్ న్యూ ఏజ్ యాంబియంట్ ఆర్ చాంట్ ఆల్బమ్‌గా అవార్డును దక్కించుకుంది. ఉత్తమ లాటిన్ పాప్ ఆల్బమ్‌కి గాను పాప్ సింగర్ షకీరా అవార్డును అందుకోగా.. ఉత్తమ డ్యాన్స్ పాప్ రికార్డింగ్ విభాగంలో చార్లీ అవార్డును దక్కించుకుంది. గ్రామీ అవార్డుల అందుకున్న వారి లిస్ట్ చూసుకుంటే..



## నేను సినిమాల్లోకి రావటానికి కారణం దీపికా పదుకొణె: నిధి అగర్వాల్




**టాకీస్:** అందాల భామ నిధి అగర్వాల్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చిన ఈ చిన్నది ఇప్పుడు తెలుగులో క్రేజీ ఆఫర్స్ ఆ అందుకుంటుంది. యంగ్ హీరోలతో మొదలు పెట్టి ఇప్పుడు స్టార్ హీరోలతో సినిమాలు చేసే రేంజ్ కు ఎదిగింది ఈ వయ్యారి భామ. నాగ చైతన్య నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.తొలి సినిమా ఫ్లాప్ అయినా కూడా ఈ అమ్మడు మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత అక్కినేని హీరో అఖిల్ సరసన సినిమా చేసింది. అఖిల్ నటించిన మిస్టర్ మజ్ను సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ అవ్వలేదు. వరుస ఫ్లాప్స్ పలకరిస్తున్న సమయంలోనే పూరి సినిమాలో ఛాన్స్ అందుకుంది. పూరిజగన్నాథ్ దర్శకత్వలో తెరకెక్కిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమా లో నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది ఈ వయ్యారి. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను కవ్వించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత క్రేజీ ఆఫర్స్ అందుకుంది. ఇక ఇప్పుడు ప్రభాస్ రాజా సాబ్, పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు సినిమాలో నటిస్తుంది. ఈ రెండు సినిమాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రెండు సినిమాల షూటింగ్స్ లో బిజీగా గడుపుతున్న ఈ అమ్మడు తాజాగా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ బీగా మారాయి. నిధి అగర్వాల్ అంత ఈజీగా హీరోయిన్ అవ్వలేదు. ఎన్నో కష్టాలు భరించింది ఈ అమ్మడు. మొదటి సినిమా సమయంలో దాదాపు రెండేళ్లు సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగిందట. తన కష్టాల గురించి ఓ ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె చూసి తాను కూడా సినిమాల్లోకి రావాలనుకున్నా.. ఆమెను ఇన్స్పిరేషన్‌గాతీసుకున్నా.. మొదట్లో ఇంట్లో ఒప్పుకోలేదు. ఆతర్వాత నన్ను ఎంకరేజ్ చేశారు. దాదాపు రెండేళ్ల పాటు ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఆఫీసుల చుట్టూ తిప్పించుకొని ఆతర్వాత అవకాశం లేదు అంటూ పంపించేశారు. మైఖేల్ మున్నా సినిమా ఆడిషన్‌కి వెళ్తే దాదాపు 300 మందిలో అదృష్టం బాగుండి నేను సెలక్ట్ అయ్యాను. ఆ సినిమా చూసి నాకు నాగ చైతన్య 'సవ్యసాచి'లో చాన్స్ వచ్చింది అని చెప్పుకొచ్చింది నిధి అగర్వాల్.

## గ్లామర్ షోతో టెంపరేచర్ పెంచేస్తున్న తెలుగు పిల్ల

### అందాల ఆరబోతలో హద్దు దాటిన అనన్య

టాకీస్: 'వకీల్ సాబ్' ఫేమ్ అనన్య నాగళ్ల. ఈ అమ్మడు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాక్టింగ్ మీద ఇంట్రెస్టింగ్ తో ఇన్ఫోసిస్‌లో జాబ్ చేస్తూ యాక్టింగ్ క్లాసులకు వెళ్లింది. ఆ తర్వాత సినిమాలపై ఉండే క్రేజ్‌తో జాబ్ వదిలేశారు. అలా 'షాదీ' అనే షార్ట్ ఫిల్మ్‌తో నటించే అవకాశం సంపాదించుకుంది. ఈ షార్ట్ ఫిల్మ్ నటించినందు కు 2017లో ఈమెకు బెస్ట్ యాక్ట్రెస్‌గా 'సైమా' అవార్డు కూడా అందుకుంది. దీంతో 'మల్లేశం' సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం దక్కించుకుంది అనన్య. ఈ సినిమాలో అనన్య నటనకు మంచి గుర్తింపు లభించింది. ఇక పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమా 'వకీల్ సాబ్' సినిమాలోప్రధాన పాత్రలో నటించే అవకాశం లభిం చింది. ఈ సినిమాతో అనన్య గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. టాలీవుడ్ లో మంచి గుర్తింపు వచ్చింది. తన నటనకు కూడా మంచి మార్కులు పడ్డాయి. దీంతో ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు వచ్చాయి. అలా 'ప్లేబ్యాక్', 'మ్యాస్ట్రో', 'ఊర్వసివో రాక్షసివో', 'శాకుంతలం', 'మళ్లీ పెళ్లి', 'తంత్ర', 'డార్లింగ్' అనే చిత్రాల్లోనూ సందడి చేసింది. ఇలా పలు డిఫరెంట్ పాత్రల్లో నటిస్తూ దూసుకుపోతుంది. రిసెంట్ గా 'పొట్టేల్', శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్'అనే సినిమాల లో హీరోయిన్ గా నటించి మెప్పించింది. ఈ మూవీ కూడా పాజిటివ్ టాక్ వచ్చింది. ఇందులో పొట్టేల్ మూవీ పాజిటి వ్ టాక్ సొంతం చేసుకుని సక్సెస్ అయ్యింది. ఈ క్రమం లో మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ సినిమాలో నటించే అవకాశం కొట్టేసింది. అనన్య నాగళ్ల సోషల్ మీడియాలోనూ యాక్టీవ్‌గా ఉంటూ తన లేటెస్ట్ ఫొటోలను, పర్సనల్ విషయాలను తన అభిమానులతో పంచుకుంటుంది. అలా తాజాగా ఈ అమ్మడు లేటెస్ట్ హాట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.